ఎన్జీఓలు ఆరోగ్యకరమైన, మెరుగైన విద్యావంతులు మరియు మరింత సమానమైన సమాజాలను సృష్టించడానికి కృషి చేస్తాయి, ఇక్కడ విద్యను కలిగి ఉన్న బాలికలు మరింత ఆత్మవిశ్వాసంతో ఉంటారు మరియు వారి కుటుంబాలకు మరియు సమాజాలకు ప్రయోజనం చేకూర్చే ఎక్కువ ఆర్థిక అవకాశాలను కొనసాగించవచ్చు. ఇది లింగ అసమానతను తగ్గించడానికి మరియు విస్తృత సామాజిక మరియు ఆర్థిక వృద్ధిని పెంపొందించడానికి కూడా సహాయపడుతుంది.



# రుతుక్రమ ఆరోగ్యం బాలికల ప్రాథమిక హక్కు

## జీవించే హక్కు, విద్యాహక్కులో ఇది కూడా భాగమే

## పాఠశాలల్లో బాలికలకు ఉచితంగా శానిటరీ న్యాప్‌కిన్లు

## బడిలో ఆడ, మగపిల్లలకు వేర్వేరు మరుగుదొడ్లు

## 3 నెలల్లోగా ఈ ఆదేశాలను అన్ని స్కూళ్లల్లో అమలు చేయాలి

## సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ

రాజ్యాంగం ప్రసాదించిన జీవించే హక్కు, విద్యాహక్కులో భాగంగా.. నెలసరి సమయంలో ఆరోగ్యంగా ఉండడం (రుతుక్రమ ఆరోగ్యం) మహిళల ప్రాథమిక హక్కు అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆరు నుంచి 12వ తరగతి వరకూ చదివే కౌమార దశలోని బాలికల కోసం కేంద్రం రూపొందించిన 'పాఠశాలలకు వెళ్లే బాలికల కోసం రుతుక్రమ పారిశుధ్య విధానా'న్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని జస్టిస్ జేబీ పార్ధీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం సూచించింది. అందులో భాగంగా.. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో మగ పిల్లలకు, ఆడ పిల్లలకు వేరువేరుగా శౌచాలయాలను



ఏర్పాటు చేయాలని, వాటిలో ఉపయోగించడానికి వీలయ్యే నీటి కనెక్షన్ ఉండేలా చూడాలని, విద్యార్థినులకు పర్యావరణ హిత శానిటరీ న్యాప్‌కిన్స్‌ను ఉచితంగా అందుబాటులో ఉంచాలని దేశంలోని అన్ని రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వాలను ఆదేశించింది. ఈ తీర్పును అమలు చేయకపోతే ప్రైవేటు స్కూళ్ల గుర్తింపును రద్దుచేయాలని.. ప్రభుత్వ పాఠశాలల్లో అమలుచేయకపోతే అందుకు నేరుగా రాష్ట్రప్రభుత్వాలను బాధ్యులను చేస్తామని హెచ్చరించింది. పాఠశాలల్లో విద్యార్థినులకు ఉచితంగా శానిటరీ న్యాప్‌కిన్లు అందించాలని, కనీస పారిశుధ్య సౌకర్యాలు ఏర్పాటయ్యేలా చూడాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. ఈ తీర్పును వెలువరించింది. "ఒక పీరియడ్ (ఫుల్‌స్టాప్) వాక్యాన్ని ముగించాలి తప్ప.. బాలికల విద్యను కాదు" అన్న అమెరికన్ విద్యావేత్త, సామాజిక కార్యకర్త మెలిస్సా బెర్టన్ హృద్యమైన వ్యాఖ్యను ఉటంకిస్తూ జస్టిస్ జేబీ పార్డీవాలా 126 పేజీల తీర్పును ప్రారంభించారు. "రాజ్యాంగంలోని 21వ అధికరణం కింద కల్పించిన జీవించేహక్కులో రుతుక్రమ ఆరోగ్యం కూడా ఒక భాగమే. ఒక బాలిక అత్యున్నతమైన లైంగిక, పునరుత్పత్తి ఆరోగ్యాన్ని సాధించడానికి.. సురక్షితమైన, ప్రభావవంతమైన, అందుబాటు ధరల్లో ఉండే నెలసరి ఆరోగ్య నిర్వహణ చర్యలు ఉపయోగపడతాయి. ఆరోగ్యకరమైన పునరుత్పత్తి జీవితాన్ని గడిపేహక్కులో భాగంగా.. లైంగిక ఆరోగ్యాన్ని గురించి తెలుసుకునే హక్కు, దానికి సంబంధించిన చదువును పొందే హక్కు కూడా ఉంటుంది" అని ఆయన తన తీర్పులో పేర్కొన్నారు. కాగా.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ఏ ప్రకారం లభించే 'విద్యాహక్కు'ను సుప్రీంకోర్టు 'మల్టీప్లయర్ రైట్'గా (అంటే.. ఒక వ్యక్తి బాగా చదువుకుంటే, తద్వారా తనకున్న మిగతా అన్ని హక్కుల గురించీ తెలుసుకుంటారని అర్థం) అభివర్ణించింది. మనిషి గౌరవంగా బతకాలన్నా, జీవించే హక్కును పూర్తిస్థాయిలో అనుభవించాలన్నా అది చదువు ద్వారానే సాధ్యమని తేల్చిచెప్పింది. అంతటి కీలకమైన చదువుకు.. రుతుక్రమంపై సరైన అవగాహన లేకపోవడం వల్ల, పాఠశాలల్లో సౌకర్యాలు లేకపోవడం వల్ల చాలా మంది బాలికలు దూరం కావాల్సిన పరిస్థితి వస్తోందని.. చదువు ఆగిపోవడం వల్ల వారు తమ ఇతర హక్కులను కూడా వినియోగించుకోలేకపోతున్నారని ఆవేదన వెలిబుచ్చింది. ప్రాథమిక విద్యా హక్కు, విద్యాహక్కు చట్టం అనేవి.. ఉచిత, నిర్బంధ విద్యను అందిస్తాయని, అటువంటి విద్యను పొందడానికి అడ్డంకిగా మారే ఖర్చులు, రుసుములు ఏవైనా సరే ఈ హక్కు కిందకే వస్తాయని తేల్చిచెప్పింది. శానిటరీ ప్యాడ్లకు అయ్యే ఖర్చు వల్ల విద్యార్థినులు చదువు మానేయాల్సిన పరిస్థితి వస్తే ఆ ఖర్చును ప్రభుత్వమే భరించాలని స్పష్టం చేసింది. పాఠశాలల్లో రుతుక్రమ ఆరోగ్య నిర్వహణ చర్యలు లేకపోవడం వల్ల బాలికల విద్య

ఆగిపోకుండా పలు కీలక ఆదేశాలను ధర్మాసనం జారీ చేసింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలన్నింటిలోనూ ప్రమాణాలకు తగినట్టుగా తయారుచేసిన పర్యావరణహిత శానిటరీ న్యాప్కిన్లను విద్యార్థినులకు ఉచితంగా అందుబాటులో ఉంచాలని అన్ని రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వాలనూ ఆదేశించింది. వాటిని కూడా.. మరుగుదొడ్ల ప్రాంగణంలోనే, వెండింగ్ మెషీన్ల ద్వారా అందుబాటులో ఉంచాలని, అలాంటి అవకాశం లేని చోట.. ఒక నిర్ణీత ప్రదేశంలో నిర్ణీత అధికారి(టీచర్/ప్రిన్సిపాల్) వద్ద లభ్యమయ్యేలా చూడాలని పేర్కొంది. ప్రతి పాఠశాలలోనూ ఆడ-మగ పిల్లలకు వేర్వేరు మరుగుదొడ్లు, నిరంతర నీటి సౌకర్యంతో ఉండేలా చూడాలని ఆదేశించింది. పాఠశాలల్లో ఇప్పటికే ఉన్న, కొత్తగా కట్టబోయే మరుగుదొడ్లను.. విద్యార్థుల గోప్యతను కాపాడేలా, దివ్యాంగులతో సహా పిల్లలందరి అవసరాలకు అనుగుణంగా ఉండాలని స్పష్టం చేసింది.

పాఠశాలలో ఉన్నప్పుడు నెలసరి వస్తే బాలికలు ఇబ్బంది పడకుండా.. అత్యవసర చర్యల్లో భాగంగా అన్ని పాఠశాలలూ రుతుక్రమ ఆరోగ్య నిర్వహణ కార్నర్లు ఏర్పాటుచేయాలి. వాటిలో అదనపు లోదుస్తులు, అదనపు యూనిఫారాలు, వాడిన శానిటరీ న్యాప్‌కిన్లను పారేయడానికి వీలుగా డిస్పోజబుల్ బ్యాగులు, ఇతరత్రా అవసరమైన అన్ని వస్తువులనూ ఆయా కార్నర్లలో ఉంచాలి. ప్రతి పాఠశాలలోనూ వాడేసిన శానిటరీ న్యాప్‌కిన్లను పారవేయడానికి సురక్షితమైన, పరిశుభ్రమైన, పర్యావరణానికి హాని కలిగించని యంత్రాంగం ఉంచేలా చర్యలు తీసుకోవాలి. 'రుతుక్రమ ఆరోగ్యం, యవ్వనదశపై అవగాహన, శిక్షణ' అనే అంశంపై పాఠ్యాంశాల్లో మార్పులు చేయాలని.. నెలసరి సమయంలో, యవ్వనదశలో వచ్చే మార్పులు, ఆరోగ్య సమస్యలపై లింగ సున్నితత్వంతో కూడిన పాఠ్యాంశాలను చేర్చాలని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ), స్టేట్ కౌన్సిల్స్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎస్‌సీఈఆర్‌టీ)లకు ఆదేశాలు జారీచేసింది.

పాఠశాలల్లో మౌలికవసతులు.. ముఖ్యంగా మరుగుదొడ్లు, శుభ్రం చేసుకునే వసతులు ఉన్నాయా లేవా? శానిటరీ న్యాప్‌కిన్లు అందుబాటులో ఉన్నాయా? వాడిన న్యాప్‌కిన్లను సురక్షితంగా పారేసే ఏర్పాట్లు ఉన్నాయా? లేవా? అనే అంశాలపై తరచుగా తనిఖీలు నిర్వహించాలని జిల్లా విద్యాధికారులను ఆదేశించింది. తీర్పు వెలువడిన తేదీ నుంచి 3 నెలల్లోగా ఈ ఆదేశాలన్నీ కచ్చితంగా అమలయ్యేలా చూడాలని ఆదేశించింది. అలా అమలవుతున్నాయా లేదా ఎప్పటిప్పుడు పర్యవేక్షించాలని జాతీయ, రాష్ట్రాల బాలల హక్కుల పరిరక్షణ కమిషన్లను కోరింది.

# దోషుల ఆస్తుల వేలంతో బాధితులకు పరిహారం..

# ఎందుకు ఇవ్వకూడదు?

## యాసిడ్ దాడుల కేసు విచారణలో ప్రశ్నించిన సుప్రీం ధర్మాసనం

ప్రస్తుతం ఇస్తున్న పరిహారం ఏమాత్రం సరిపోదు

పరిహారం పెంపును పరిశీలించాలని ప్రభుత్వాలకు సూచన

యాసిడ్ దాడి కేసుల సమగ్ర వివరాలు అందించాలని ఆదేశం

రాష్ట్రాలకూ, కేంద్రపాలిత ప్రాంతాలకు నాలుగు వారాల గడువు

యాసిడ్ దాడి క్రూరమైనది: సిజెఐ సూర్యకాంత్



సిజెఐ సూర్యకాంత్

యాసిడ్ దాడుల కేసుల్లో దోషుల ఆస్తులను వేలం వేసి బాధితులకు పరిహారంగా ఎందుకు ఇవ్వకూడదని అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించింది. జీవితాంతం చికిత్స, పునరావాసం కోసం, ప్రస్తుతం బాధితులకు అందజేస్తున్న పరిహారం (కనీసం రూ.3 లక్షలు) సరిపోదని అభిప్రాయపడింది. ఈ విషయంలో మెరుగైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించింది. యాసిడ్ దాడి బాధితురాలు షాహీన్ మాలిక్ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని సుప్రీం ధర్మాసనం విచారించింది. బలవంతంగా యాసిడ్ తాగించిన ఘటనల్లో బాధితులకు తగిన పరిహారం, వైద్య సంరక్షణ సహా ఇతర ఉపశమనాలు లభించేలా చర్యలు తీసుకోవాలని ఆమె న్యాయస్థానాన్ని కోరారు. తనపై జరిగిన యాసిడ్ దాడి కేసులో ఇప్పటికే 16 ఏళ్లు పోరాడానని, కానీ ట్రయల్ కోర్టులో నిందితులందరూ నిర్దోషులుగా విడుదలయ్యారని ఆమె న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. ఈ కేసులో పోరాడుతూ తన జీవితంలో విలువైన కాలాన్ని కోల్పోయానని

షాహీన్ చెప్పారు. అయితే బాధితురాలి తరపున హైకోర్టులో మంచి న్యాయవాది ఈ కేసును వాదించేలా సర్వోన్నత న్యాయస్థానం చర్యలు తీసుకుంటుందని సీజేఐ హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో యాసిడ్ దాడుల కేసుల విషయంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. యాసిడ్ దాడుల కేసుల సంఖ్య, కోర్టుల్లో వాటి పురోగతి, దాడుల తర్వాత ప్రాణాలతో బయటపడిన వారికి అందించిన పునరావాస చర్యలపై వివరణాత్మక సమాచారాన్ని సమర్పించాలని దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. యాసిడ్ దాడి బాధితురాలు, సామాజిక కార్యకర్త షాహీన్ మాలిక్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారిస్తూ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ ఆర్ మహదేవన్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి నేతృత్వంలోని ధర్మాసనం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఈ ఆదేశాలను పాటించడానికి రాష్ట్రాలు, యూటీలకు నాలుగు వారాల గడువును ఇచ్చింది. యాసిడ్ దాడి కేసులపై సంవత్సరాల వారీగా డేటాను సమర్పించాలని రాష్ట్రాలు, యూటీలను సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వీటిలో ఛార్జ్‌షీట్లు దాఖలైన కేసుల సంఖ్య, అలాగే కోర్టు స్థాయిలో విచారణలో ఉన్న, పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్య గురించి కూడా సమాచారం ఇవ్వాలని ఆదేశించింది. హైకోర్టులు సహా అప్పీలేట్ కోర్టుల్లో దాఖలైన అప్పీళ్ల సంఖ్య గురించి తెలియజేయాలని పేర్కొంది. అలాగే యాసిడ్ బాధితుల కేసు నిర్దిష్ట వివరాలను, వారి విద్యా నేపథ్యం, ఉద్యోగం, వైవాహిక స్థితి, చికిత్స, పునరావాసం వంటి వివరాలను అందించాలని, అలాగే బాధితులను యాసిడ్ తాగమని బలవంతం చేసిన కేసుల వివరాలను తమకు అందజేయాలని ఆదేశించింది. యాసిడ్ బాధితుల పునరావాస ప్రయత్నాల పరిధి, ప్రభావాన్ని అంచనా వేయడానికి ఈ సమాచారం చాలా ముఖ్యమైనదని విచారణ సందర్భంగా ధర్మాసనం అభిప్రాయపడింది.

## యాసిడ్ దాడి క్రూరమైనది: సిజెఐ సూర్యకాంత్

కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. యాసిడ్ దాడులను క్రూరమైన దాడిగా అభివర్ణించారు. అటువంటి నేరాలకు పాల్పడేవారిని శిక్షించడానికి ప్రస్తుత చట్టాలు సరిపోకపోవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. యాసిడ్ దాడులకు పాల్పడిన నేరస్థులను శిక్షించడానికి చట్టాన్ని సవరించే అవకాశాన్ని పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సూచించారు.

## 16 ఏళ్లుగా పోరాడుతున్నా: షాహీన్ మాలిక్

కాగా, యాసిడ్ దాడి బాధితులు అంతర్గత గాయాల బారిన పడుతున్నారని షాహీన్ మాలిక్ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అటువంటి ప్రాణాంతక దాడుల నుంచి బయటపడిన వారిని దివ్యాంగులుగా గుర్తించేందుకు చట్టబద్ధమైన నిర్వచనాన్ని



యాసిడ్ దాడి బాధితురాలు
షాహీన్ మాలిక్

విస్తరించాలని కోరారు. తద్వారా యాసిడ్ దాడి బాధితులు మెరుగైన పరిహారం, మద్దతు, దీర్ఘకాలిక వైద్య సంరక్షణను పొందేందుకు వీలు కల్పించాలని దేశ అత్యున్నత న్యాయస్థానానికి విజ్ఞప్తి చేశారు. 2009లో యాసిడ్ దాడి బాధితురాలు, బ్రేవ్ సోల్స్ ఫౌండేషన్ (ఎన్జీఓ) వ్యవస్థాపకురాలు షాహీన్ మాలిక్ వేసిన ప్రజాప్రయోజనాల వ్యాజ్యంపై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఈ కేసు విషయంలో తాను 16 ఏళ్లుగా పోరాడుతున్నానని, అయితే ట్రయిల్ కోర్టులో నిందితులందరూ విడుదల అయ్యారని షాహీన్ మాలిక్ అత్యున్నత న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చారు. యాసిడ్ దాడి జరిగినప్పుడు తన వయస్సు 26 ఏళ్లని, ఇప్పుడు 42 ఏళ్లని చెప్పారు. తన జీవితంలో విలువైన కాలాన్ని ఈ కేసు కోసం జరిపిన పోరాటంలోనే కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ తాను ఎక్కడున్నానో అర్థం కావడం లేదని ఆమె తన పిటిషన్‌లో ఆవేదన వ్యక్తం చేశారు.

# మీడియాకు పోలీసుల బ్రీఫింగ్‌పై కఠిన నియంత్రణ ఉండాలి

## మీడియా ట్రయల్‌తో దర్యాప్తునకు ఆటంకాలు
## నిందితుల హక్కుల ఉల్లంఘనకు అవకాశం
## మూడు నెలల్లో బ్రీఫింగ్ విధానాలు రూపొందించాలి
## అన్ని రాష్ట్రాలను ఆదేశించిన సుప్రీంకోర్టు

మీడియాకు పోలీసులు ఇచ్చే బ్రీఫింగ్‌పై కఠిన నియంత్రణలు ఉండాలని సుప్రీంకోర్టు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఆదేశాలు జారీ చేసింది. క్రిమినల్ కేసుల్లో పోలీసుల అనియంత్రిత ప్రెస్ బ్రీఫింగ్‌ల వల్ల నిందితుల హక్కుల ఉల్లంఘన, మీడియా ట్రయల్ కారణంగా కేసుల దర్యాప్తునకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ (పియుసిఎల్) దాఖలు చేసిన పిటిషన్‌పై చేపట్టిన విచారణలో సుప్రీంకోర్టు ఈమేరకు ఆదేశాలిచ్చింది. జస్టిస్ ఎంఎం.సుందరేశ్, జస్టిస్ ఎన్.కోటిశ్వర్ సింగ్ బెంచ్

జనవరి 15న ఇచ్చిన ఆదేశాలు సుప్రీంకోర్టు వెబ్‌సైట్లో పబ్లిష్ అయ్యాయి. అన్ని రాష్ట్రాలు 3 నెలల్లో పోలీస్ మీడియా బ్రీఫింగ్ విధానాలు (పాలసీ) రూపొందించి అమలు చేయాలని పేర్కొంది. ఈ విధానాలు సుప్రీంకోర్టు అమికస్ క్యూరీ (సీనియర్ అడ్వకేట్ గోపాల్ శంకర నారాయణన్) రూపొందించిన Police Manual for Media Briefing ఆధారంగా ఉండాలని చెప్పింది. మాన్యువల్‌ను సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో రెండు వారాల్లో అప్‌లోడ్ చేయాలని రిజిస్ట్రీకి ఆదేశాలిచ్చింది. కాగా.. అమికస్ క్యూరీ మాన్యువల్ (సుమారు 60 పేజీలు)ను అంతర్జాతీయ ప్రమాణాలు, కేంద్ర ప్రభుత్వ అభిప్రాయాల ఆధారంగా రూపొందించారు. నిర్దోషిగా భావించే హక్కు ఉల్లంఘన కాకుండా చూడాలి. రాష్ట్రాలు ఈ మాన్యువల్ ఆధారంగా తమ స్థానిక అవసరాలకు తగినట్లు విధానాలు రూపొందించాలి. దీనికి సంబంధించి రాష్ట్రాలు ఇప్పటివరకు తగిన చర్యలు తీసుకోలేదని పరిశీలించిన న్యాయస్థానం.. ఇక ఆలస్యం చేయకుండా మరో మూడు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించింది. కేసు వివరాలు.. నిందితుల పేర్లు, ఫొటోలు, ఆధారాలను పోలీసులు ముందుగానే మీడియాకు బహిర్గతం చేయడం వల్ల, నిందితులకు న్యాయ విచారణలో న్యాయమైన అవకాశం దెబ్బతింటుందని, మీడియా ట్రయల్ జరిగి పబ్లిక్ ఒపీనియన్ ప్రభావితం కావడంతో పాటు దర్యాప్తునకు ఆటంకం కలుగుతుందని, అనవసర సమాచారం బయటపడి అనుమానాలు, భయాలు పెరుగుతాయని పియుసిఎల్ తన పిటిషన్‌లో పేర్కొంది.

# కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపై రాష్ట్ర పోలీసులు కేసులు పెట్టవచ్చు: సుప్రీం కోర్టు

కేంద్ర ప్రభుత్వ అధికారులపై అవినీతి ఆరోపణలు ఉంటే, రాష్ట్ర పోలీసులు లేదా రాష్ట్ర అవినీతి నిరోధక శాఖలు దర్యాప్తు చేయవచ్చని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఇందుకు సీబీఐ అనుమతి అవసరం లేదని తేల్చి చెప్పింది. రాష్ట్ర ఏజెన్సీ దాఖలు చేసిన చార్జ్‌షీట్ చెల్లుబాటు అవుతుందని, కేవలం కేంద్ర ఉద్యోగి అనే కారణంతో దాన్ని కొట్టివేయలేమని కోర్టు తెలిపింది. 'ఫెడరల్ షీల్డ్' (కేంద్ర రక్షణ) అంటూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక రక్షణ ఉండదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది.

ఓ కేంద్ర ప్రభుత్వ అధికారిపై రాష్ట్ర ఏసీబీ నమోదు చేసిన అవినీతి కేసును కొట్టివేయడానికి రాజస్థాన్ హైకోర్టు నిరాకరించింది. ఆ తీర్పుపై సుప్రీం కోర్టులో దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా ఈ తీర్పు వెలువడింది. కేంద్ర ఉద్యోగిగా, తాను ఢిల్లీ స్పెషల్

పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ పర్యవేక్షణకు మాత్రమే లోబడి ఉండాలని, తనపై రాష్ట్రం నేతృత్వంలో జరిగే ఏ దర్యాప్తు అయినా చట్టబద్ధంగా చెల్లదని పిటిషనర్ వాదించారు. ఈ వాదనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. అలాంటి రక్షణ ఉండదని తేల్చి చెప్పింది.

ఇంతకుముందు కేంద్ర ప్రభుత్వ అధికారులపై అవినీతి కేసులను కేవలం సీబీఐ మాత్రమే విచారణ చేయాలనే భావన ఉండేది. తాజా తీర్పుతో ఆ అపోహకు తెరపడింది. అవినీతి నిరోధక చట్టం, 1988 ప్రకారం కేంద్ర ఉద్యోగిని దర్యాప్తు చేయడం కోసం సీబీఐ ముందస్తు అనుమతి అవసరం లేదని సుప్రీం కోర్టు పేర్కొంది. కాగా, స్థానిక అవినీతి నిరోధక పరిశీలన నుంచి తప్పించుకోవడానికి కేంద్ర ఉద్యోగులు తమ ఫెడరల్ హోదాను కవచంగా ఉపయోగించుకోకుండా ఈ తీర్పు నిరోధిస్తుంది.

# సహజీవన బంధంలో మహిళకు భార్య హోదా

## అప్పుడే ఆమెకు రక్షణ : మద్రాస్ హైకోర్టు



సహజీవన (లివింగ్ టుగెదర్) సంబంధాల్లో, మహిళలకు గాంధర్వ/ప్రేమ వివాహం కింద 'భార్య' హోదా కల్పించడం ద్వారా వారిని రక్షించాలని మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం అభిప్రాయపడింది. అప్పుడే ఆ సంబంధంలో సమస్యలున్నా, ఆమె 'భార్య' హోదాతో తట్టుకోగలుగుతుందని పేర్కొంది. పెళ్లి చేసుకుంటానని ఓ యువతిని మాయమాటలతో నమ్మించి సహజీవనం చేసిన ఓ యువకుడు ముందస్తు బెయిలు కోరుతూ దాఖలుచేసిన పిటిషన్ కొట్టివేస్తూ న్యాయమూర్తి జస్టిస్ ఎస్.శ్రీమతి ఈ వ్యాఖ్యలు చేశారు. "ప్రాచీన భారతదేశంలో ఉన్న 8 రకాల వివాహాల్లో ఒకటి గాంధర్వ వివాహం. అదే ప్రేమ వివాహం. సహజీవన సంబంధాలను ఆ వివాహాలుగా గుర్తించవచ్చు. ఇలాంటి వ్యవహారాల్లో మహిళలకు రక్షణ కల్పించేది బీఎన్ఎస్ సెక్షన్ 68 మాత్రమే. ఈ సెక్షన్ కింద నమోదైన కేసుల్లో పురుషులు బీఎన్ఎస్ సెక్షన్ 69 కింద విచారణను ఎదుర్కోవాల్సి ఉంటుంది" అని న్యాయమూర్తి స్పష్టం చేశారు.

# సానుభూతి చూపలేం: ఢిల్లీ హైకోర్టు

## ఉన్నావ్ అత్యాచార కేసులో శిక్షను నిలుపుదల చేయాలన్న సెంగార్ పిటిషన్ కొట్టివేత




2017లో ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఉన్నావ్‌లో జరిగిన సంచలనాత్మక అత్యాచార కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో దోషిగా తేలిన మాజీ ఎమ్మెల్యే కుల్దీప్ సెంగార్ వేసిన పిటిషన్ను ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది. తనకు విధించిన పదేళ్ల జైలుశిక్షను నిలిపి వేయాలంటూ ఢిల్లీ హైకోర్టులో సెంగార్ పిటిషన్ వేశాడు. దీనిపై విచారణ చేపట్టిన ఢిల్లీ న్యాయస్థానం.. ఆ పిటిషన్ను కొట్టివేసింది. 'రిలీఫ్ మంజూరు చేయడానికి నిందితుని తరపు న్యాయవాదులు ఎలాంటి కారణాలూ చూపలేదు. శిక్షను నిలిపివేయాలని కోరుతూ దాఖలు చేసిన వాజ్యాన్ని తిరస్కరిస్తున్నాం' అని జస్టిస్ రవీందర్ దుడేజా స్పష్టం చేశారు. ఉన్నావ్ బాధితురాలి తండ్రి మృతి కేసులో ట్రయల్ కోర్టు 2020 మార్చి 13న సెంగార్‌కు పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 లక్షల జరిమానా విధించింది. ఒక కుటుంబానికి ఆధారమైన వ్యక్తిని హతమార్చినందుకు దోషి విషయంలో ఎలాంటి సానుభూతీ చూపలేమని న్యాయస్థానం పేర్కొంది. ఈ కేసులో కుల్దీప్ సెంగార్ సోదరుడు అతుల్ సింగ్ సెంగార్‌తో పాటు మరో ఐదుగురికీ పదేళ్ల జైలు శిక్ష విధించింది. సెంగార్ అండతో పోలీసులు.. బాధితురాలి తండ్రిని హింసించారు. చివరకు ఆయన.. 2018 ఏప్రిల్ 9న మరణించాడు. ఈ అత్యాచార కేసులో నిందితునికి జీవితాంతం జైలుశిక్ష విధించిన డిసెంబర్ 2019 నాటి తీర్పునకు వ్యతిరేకంగా.. అలాగే బాధితురాలి తండ్రి కేసులోనూ సెంగార్ దాఖలు చేసిన పిటిషన్ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. అత్యాచార కేసులో తనపై విధించిన శిక్ష, తీర్పును సవాలు చేస్తూ దాఖలు చేసిన అప్పీల్ పెండింగ్‌లో ఉండటంతో 2025 డిసెంబర్ 23న హైకోర్టు సెంగార్ శిక్షను నిలిపివేసింది. దీన్ని సవాల్ చేస్తూ సీబీఐ స్పెషల్ లీవ్ పిటిషన్ను దాఖలు చేసింది. కుల్దీప్ బయటకు వస్తే కేసుపై ప్రభావం పడే అవకాశముందని సీబీఐ పేర్కొంది. ఈ పిటిషన్‌ను 2025 డిసెంబర్ 29న విచారించిన సుప్రీం న్యాయస్థానం.. ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పు ఉత్తర్వులను నిలిపివేయడంతో పాటు నిందితుడు కుల్దీప్ సెంగార్‌కు నోటీసులు జారీ చేసింది.

# ఆరోపణలు కాదు సరైన ఆధారాలు కావాలి

## వరకట్న వేధింపుల కేసులో ఐదుగురు కుటుంబ సభ్యులు నిర్దోషులు

### జీవిత ఖైదు శిక్షను కొట్టివేసిన తెలంగాణ హైకోర్టు



వరకట్న వేధింపుల కేసుల్లో ఆరోపణలు ఉంటే సరిపోవని .. సరైన ఆధారులు ఉండాలని తెలంగాణ హైకోర్టు అభిప్రాయపడింది. ఆధారాలుంటేనే నిందితులకు శిక్షలు విధించటానికి వీలుంటుందని స్పష్టం చేసింది. వికారాబాద్ జిల్లాలో 2011లో జరిగిన ఒక వివాహిత వరకట్న వేధింపుల ఆత్మహత్య కేసులో కీలక తీర్పును వెలువరించింది. ఈ కేసులో కింది కోర్టు విధించిన జీవిత ఖైదు శిక్షను కొట్టివేస్తూ.. నిందితులుగా ఉన్న ఐదుగురు కుటుంబ సభ్యులను నిర్దోషులుగా ప్రకటించింది. జస్టిస్ కె. లక్ష్మణ్, జస్టిస్ వాకిటి రామకృష్ణారెడ్డిలతో కూడిన ధర్మాసనం.. ప్రాసిక్యూషన్ నిందితులపై నేరాన్ని నిరూపించడంలో విఫలమైందని స్పష్టం చేస్తూ ఈ సంచలన తీర్పును వెలువరించింది. వివరాల్లోకి వెళితే.. 2011 ఆగస్టులో వివాహమైన 15 నెలలకే ఒక మహిళ ఆత్మహత్య చేసుకుంది. అదనపు వరకట్నం కోసం భర్త, అత్తమామలు, ఆడపడుచు, ఆమె భర్త వేధిస్తున్నారంటూ బాధితురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసును విచారించిన వికారాబాద్ ట్రయల్ కోర్టు.. 2016లో ఆ ఐదుగురిని దోషులుగా తేల్చి వారికి జీవిత ఖైదు శిక్ష విధించింది. దీనిని సవాలు చేస్తూ నిందితులు హైకోర్టులో అప్పీల్ దాఖలు చేశారు. ఈ అప్పీల్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు ధర్మాసనం.. భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 304-బి కింద ఒక నేరాన్ని పరిగణించాలంటే కొన్ని కీలక నిబంధనలు ఉండాలని గుర్తుచేసింది. కేవలం వేధింపుల ఆరోపణలు ఉంటే సరిపోదని.. మరణానికి కొద్దిసేపటి ముందు వరకట్నం కోసం వేధింపులు జరిగినట్లు ప్రాసిక్యూషన్ నిరూపించాల్సి ఉంటుందని కోర్టు తెలిపింది.

ఈ కేసులో అదనపు వరకట్నం కోసం వేధించారని ఎలాంటి స్వతంత్ర సాక్షులను

ప్రాసిక్యూషన్ విచారించలేదని తెలిపింది. బాధితురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన మొదటి స్టేట్‌మెంట్‌కు.. కోర్టులో చెప్పిన సాక్ష్యాలకు మధ్య భారీ వైరుధ్యాలు ఉన్నాయని కోర్టు గుర్తించింది. మరణానికి ముందు వేధింపులు జరిగినట్లు ఎక్కడా పోలీసులకు ఫిర్యాదు చేయలేదని, కనీసం పంచాయితీలు కూడా జరగలేదని బాధితురాలి తండ్రి అంగీకరించిన విషయాన్ని గుర్తు చేసింది. నిందితుల్లో ఇద్దరైన ఆడపడుచు, ఆమె భర్త హైదరాబాద్‌లో వేరుగా నివసిస్తున్నారని వారు కేవలం పండుగ కోసమే ఊరికి వచ్చారని కోర్టు స్పష్టం చేసింది. వరకట్న వేధింపుల వల్లే ఆ మహిళ ఆత్మహత్య చేసుకుందన్న వాదనను నిరూపించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని తేల్చిన హైకోర్టు.. 2016 నాటి తీర్పును రద్దు చేస్తూ ఐదుగురు నిందితులను నిర్దోషులుగా విడిచిపెట్టింది.

# జస్టిస్ స్వామినాథన్‌ను విమర్శించిన పుస్తకాన్ని తక్షణం స్వాధీనం చేసుకోండి

## తమిళనాడు ప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టు ఆదేశం



తిరుప్పరంకుండ్రంపై కార్తీక దీపం వెలిగించేందుకు అనుమతిస్తూ తీర్పునిచ్చిన మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జీఆర్ స్వామినాథన్ కీర్తి ప్రతిష్ఠలకు భంగం కలిగించేలా పుస్తకం ప్రచురించడంపై మద్రాస్ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. చెన్నైలో పుస్తక ప్రదర్శనలో ఆ పుస్తకాన్ని పెట్టరాదని ఆదేశించింది. అంతేకాకుండా న్యాయమూర్తిపై విమర్శలు గుప్పిస్తూ ప్రచురించిన పుస్తకాన్ని తక్షణం స్వాధీనం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆ పుస్తక ప్రచురణ సంస్థపై సుమోటోగా కేసు నమోదు చేసి, విచారణకు ఆదేశించింది. వేలూరుకు చెందిన నవీన్ ప్రసాద్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌లో జస్టిస్ స్వామినాథన్‌పై వ్యక్తిగత దూషణలు, విమర్శలతో ముద్రించిన పుస్తకాన్ని బుక్ ఎగ్జిబిషన్‌లో విక్రయిస్తే అది న్యాయవ్యవస్థలో జోక్యం చేసుకున్నట్లవుతుందని, కాబట్టి ఆ పుస్తకం అమ్మకాలపై నిషేధం విధించాలని కోరారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎంఎం శ్రీవాత్సవ, జస్టిస్ జి.అరుళ్‌మురుగన్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరిపి ఆదేశాలు ఇచ్చింది.

# వీధికుక్కల నివారణ బాధ్యత రాష్ట్రాలదే

## బాధితులకు నష్టపరిహారమూ చెల్లించాల్సిందే

## రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించిన సుప్రీంకోర్టు

భారతదేశంలో వీధి కుక్కల దాడుల విషయంపై సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రాలు.. వీధి కుక్కల నివారణకు సరైన చర్యలు తీసుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపింది. కుక్కలు కరవడం వల్ల పిల్లలు, వృద్ధులు ఎలాంటి ప్రమాదానికి గురైనా, దానికి సంబంధించిన నష్ట పరిహారం రాష్ట్రాలే చెల్లించేలా ఆదేశిస్తామని హెచ్చరించింది ధర్మాసనం. ఇటీవల వీధి కుక్కల దాడులు విపరీతంగా పెరిగిపోవడం వల్ల ప్రజలు రేబిస్‌తో పాటు ఇతర ప్రమాదకర వ్యాధుల బారినపడుతున్నారు. ఈ విషయాన్ని సుప్రీం కోర్టు సుమోటోగా తీసుకొని విచారణ చేపట్టింది. స్కూల్స్, హాస్పిటల్స్, బస్టాండ్స్, రైల్వే స్టేషన్స్, ఎయిర్ పోర్ట్స్ పరిసర ప్రాంతాల్లో ప్రజలు సంచరిస్తుంటారు. అలాంటి ప్రదేశాల్లో ఎక్కువగా వీధి కుక్కలు దాడులు చేస్తున్నాయని, వాటికి ప్రత్యేకంగా షెల్టర్లు ఏర్పాటుచేసి అక్కడికి తొలగించాలని ఆదేశించింది. కాగా.. దేశంలో వీధి కుక్కలకు సంబంధించిన కేసును న్యాయమూర్తులు విక్రమ్ నాథ్, సందీప్ మెహతా, ఎన్వీ.అంజరియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా జస్టిస్ విక్రమ్ నాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'కుక్కల వల్ల ఎవరికి నష్టం జరిగినా రాష్ట్రాలే బాధ్యత వహించి నష్టపరిహారం చెల్లించేలా ఆదేశిస్తాం. కుక్కలకు ఆహారం పెట్టేవారు వారి ఇంట్లోనే పెంచుకుని అక్కడే వాటికి తిండిపెట్టాలి. జంతు ప్రేమికులం అని చెప్పుకుని తిరిగేవారు.. ఇటీవల ఓ తొమ్మిదేళ్ల బాలుడిపై కుక్కలు అతి దారుణంగా దాడిచేసినపుడు ఎందుకు బాధ్యత తీసుకోలేదు' అని ప్రశ్నించారు. వీధుల్లోని అన్ని కుక్కలను తొలగించాలని తామెప్పుడూ ఆదేశించలేదు. యానిమల్ బర్త్ రూల్ ప్రకారం.. ట్రీట్‌మెంట్‌కాని శునకాలను షెల్టర్లకు తరలించాలని తెలిపినట్లు సుప్రీం ధర్మాసనం తెలిపింది.

# ఖర్చుల వివరాలు అడగడం భార్యను వేధించినట్టు కాదు: సుప్రీంకోర్టు

ఇచ్చిన సొమ్మును ఏవిధంగా ఖర్చు చేశావని భార్యను భర్త అడగడం క్రూరత్వం కిందికి రాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దీని ఆధారంగా కేసు పెట్టలేమని తెలిపింది. ఇలాంటి

లెక్కలు అడుగుతున్న భర్తపై కేసుపెట్టాలంటూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టివేస్తూ జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఆర్. మహదేవన్‌ల ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. తెలంగాణకు చెందిన ఓ జంట కుటుంబ వివాదాల కారణంగా వేరువేరుగా ఉంటోంది. పోషణ నిమిత్తం ఆయన ఆమెకు డబ్బులు పంపిస్తున్నాడు. వీటి లెక్కలు చూపించాలని అతడు కోరగా, అలా అడిగి డామినేట్ చేయడం క్రూరత్వం కిందికి వస్తుందంటూ ఆమె తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. దాంతో భర్తపై కేసు పెట్టాలని హైకోర్టు ఆదేశించింది. దీనిపై భర్త సుప్రీంకోర్టుకు వెళ్లడంతో హైకోర్టు ఆదేశాలను కొట్టివేసింది.

# సెర్చ్ వారంట్ జారీచేసే అధికారం పోలీసులకు ఎక్కడిది?

## అది కోర్టుల పరిధిలోది కదా? - ప్రశ్నించిన తెలంగాణ హైకోర్టు



సెర్చ్ వారంట్ జారీచేసే అధికారం పోలీసులకు ఎక్కడిదని తెలంగాణ హైకోర్టు ప్రశ్నించింది. జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌లకు ఉండే అధికారాలను పోలీసులు తమ చేతుల్లోకి తీసుకోవచ్చా? అని అడిగింది. దీనిపై పూర్తిస్థాయిలో వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసింది. పోలీసు అసిస్టెంట్ కమిషనర్, కమిషనర్ స్థాయి అధికారులు తమంత తాముగా సెర్చ్ వారంట్లు జారీ చేస్తుండటాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ విజయ్‌గోపాల్ వ్యక్తిగత హోదాలో వాదనలు వినిపిస్తూ.. సీఆర్పీసీ సెక్షన్ 93, హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్ సెక్షన్ 47ను పోలీసులు దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొన్నారు. జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌లకు ఉండే అధికారాలను వినియోగిస్తూ చుట్టుముట్టి తనిఖీలు (కార్డన్ అండ్ సెర్చ్) చేపడుతున్నారని తెలిపారు. నేరస్థులు, అక్రమ వలసదారుల కోసం అంటూ సెర్చ్ వారంట్

లేకుండానే ఇళ్లలోకి ప్రవేశించడంతోపాటు గుర్తింపు పత్రాలు అడుగుతున్నట్లు ఆరోపించారు. వాదనలు విన్న ధర్మాసనం ఏ నిబంధనలు, జీవోల ప్రకారం పోలీసులు సెర్చ్ వారంట్లు జారీచేస్తున్నారో పూర్తిస్థాయి వివరణ ఇవ్వాలని పేర్కొంది. ప్రజాభద్రతను కాపాడే విషయంలో పోలీసులు చేస్తున్న కృషిని అభినందించాల్సిందేనని, అయితే సెర్చ్ వారంట్లు జారీచేసే అధికారంపై ఉందా? అనే అంశంపై ఆధారాలతో సహా వివరణ సమర్పించాలని పేర్కొంది.

# బాలిక కిడ్నాప్, అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలుశిక్ష

## కర్నూలు పోక్సో కోర్టు తీర్పు




నంద్యాల జిల్లా పాణ్యం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారానికి పాల్పడిన కేసులో ముద్దాయికి 20ఏళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ కర్నూలు పోక్సో కోర్టు న్యాయాధికారి రాజేంద్రబాబు తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. నంద్యాలకు చెందిన పఠాన్ మహమ్మద్ ఖాన్ పాణ్యంలో ఓ హెూటల్ నిర్వహించేవాడు. ఆ హెూటల్‌కు బాలిక తరుచూ వస్తుండేది. ఈ నేపథ్యంలో పఠాన్ మహమ్మద్ ఖాన్.. వివాహం చేసుకుంటానని బాలికను నమ్మించి 2020 నవంబరు 2న కిడ్నాప్ చేశాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో పాణ్యం పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. మహమ్మద్ ఖాన్ బాలికను నెల్లూరుకు తీసుకెళ్లి ఓ ఇంట్లో నిర్బంధించాడు. 2020 డిసెంబరు 18న బాలికను వారి ఇంటి వద్ద వదిలి వెళ్లాడు. తల్లిదండ్రులు ఆమెను తీసుకుని వెళ్లి పాణ్యం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కిడ్నాప్, అత్యాచారం సెక్షన్ల కింద పోలీసులు మహమ్మద్ ఖాన్‌పై కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేసి కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. కోర్టులో నిందితుడిపై నేరం రుజువు కావడంతో 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. జైలు శిక్షను ఏకకాలంలో అనుభవించాలని, రూ.లక్ష జరిమానా బాధితురాలికి నష్టపరిహారంగా చెల్లించాలని ఆదేశిస్తూ తీర్పులో పేర్కొన్నారు.

# విద్యార్థినిపై అత్యాచారం కేసు

# ఎస్సైకి 10 ఏళ్ల జైలు శిక్ష

## గుంటూరు జిల్లా ప్రత్యేక కోర్టు తీర్పు

## మహిళా ఎస్సై పైనా చర్యలకు ఆదేశం

సామాజిక మాధ్యమాల్లో ఓ విద్యార్థినిని పరిచయం చేసుకుని, వివాహం చేసుకుంటానని నమ్మించి పలు మార్లు అత్యాచారానికి పాల్పడిన బాపట్ల జిల్లా అమృతలూరు ఎస్సై కుంచాల రవితేజ (30)కు 10 ఏళ్లు జైలు శిక్ష విధిస్తూ గుంటూరు జిల్లా ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఆర్.శరత్‌బాబు తీర్పు వెలువరించారు. నిందితుడికి అనుకూలంగా వాంగ్మూలం ఇచ్చిన మహిళా ఎస్సై రోజాలతపై శాఖాపరమైన విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా ఎస్పీని ఆదేశించారు. వివరాల్లోకి వెళితే... పల్నాడు జిల్లా రెంటచింతల మండలానికి చెందిన ఓ విద్యార్థిని బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసింది. ఎయిమ్స్‌లో ఉద్యోగ పరీక్షకు సిద్ధమయ్యేందుకు ఆమె గుంటూరులోని ఓ మహిళా హాస్టల్‌లో ఉండేది. ఆ సమయంలో గుంటూరు నగరంలోని నగరంపాలెంలో ఎస్సైగా కుంచాల రవితేజ విధులు నిర్వహిస్తున్నాడు. సోషల్ మీడియా ద్వారా ఆమెను పరిచయం చేసుకున్నాడు. తొలుత వివాహం చేసుకుంటానని నమ్మించి నగరంపాలెం పోలీస్ స్టేషన్ సమీపంలోని ఓ గదికి తీసుకెళ్లాడు. అనంతరం విజయవాడలోని హోటల్ గదికి తీసుకెళ్లి, పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. తర్వాత ఆమె గర్భవతి కావడంతో అబార్షన్ చేయించాడు. కొన్నేళ్ల తర్వాత మరో మహిళను వివాహం చేసుకోవడానికి సిద్ధం కావడంతో ఆమె అతణ్ని నిలదీసింది. దీంతో 2023 మే 7న బాధితురాలు నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అత్యాచారం, కులదూషణ, మోసం, తదితర నేరాల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో ఎస్సై రవితేజకు 10 ఏళ్లు జైలు శిక్ష, రూ.2,000 జరిమానా విధిస్తూ జడ్జి శరత్‌బాబు తీర్పు చెప్పారు. కాగా, గుంటూరు అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్సై కె.రోజాలతపై శాఖాపరమైన దర్యాప్తు జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీని ఆదేశిస్తూ న్యాయమూర్తి తీర్పులో ఆదేశాలు జారీ చేశారు.

# మహిళలు, పిల్లలు..
# ఇంటివద్దే ఫిర్యాదు చేయొచ్చు

## లైంగిక దాడులు జరిగినప్పుడు స్టేషన్ వరకు వెళ్లక్కర్లేదు

## తెలంగాణ పోలీసు శాఖ కొత్త నిర్ణయం




శారీరక, లైంగిక దాడులకు గురైన మహిళలు, పిల్లలు ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా తెలంగాణ పోలీసు శాఖ ఒక కొత్త నిర్ణయం తీసుకుంది. బాధితులు కోరుకున్నచోటుకే పోలీసులు వెళ్లి, వారి నుంచి ఫిర్యాదు స్వీకరించి, ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారని మహిళా భద్రతా విభాగం అదనపు డీజీ చారుసిన్హా తెలిపారు. దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో ఈ విప్లవాత్మక మార్పును తీసుకొస్తున్నట్టు ఆమె తెలిపారు. దాడులకు గురైన మహిళలు, పిల్లలు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని గుర్తించామని, పోక్సో కేసుల్లో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉందని ఆమె వివరించారు. బాల్య వివాహాల నిరోధక చట్టం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టానికి సంబంధించిన ఫిర్యాదులు, ర్యాగింగ్ ఫిర్యాదులను సైతం బాధితుల వద్దకే పోలీసులు వెళ్లి నమోదు చేసుకోవడం ద్వారా న్యాయప్రక్రియను వేగవంతం చేయగలుగుతామని, బాధితులకు భరోసా కల్పించగలుగుతామని ఆమె తెలిపారు. కొత్త విధానం ప్రకారం.. నేరం జరిగినపుడు బాధితులు ఫోన్ లేదా మౌఖికంగా పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇస్తే సరిపోతుంది. వెంటనే సంబంధిత పోలీసు అధికారి బాధితుల నివాసానికి/ఘటనా స్థలానికి (లేదా) బాధితులు చికిత్స పొందుతుంటే ఆసుపత్రులకు చేరుకుంటారని ఆమె వివరించారు. వారి నుంచి ఫిర్యాదును స్వీకరించి వెంటనే పోలీసు స్టేషన్‌కు పంపించి ఎఫ్ఐఆర్ నమోదు చేయిస్తారని, ఆపై ఎఫ్ఐఆర్ కాపీని బాధితుల ఇంటి వద్ద అందజేస్తారని పేర్కొన్నారు. సమాచారం అందిన వెంటనే తమ పరిధి కాకున్నా ఆయా పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిందేనని, అలా ఎవరైనా తిరస్కరిస్తే వారిపై చర్యలుంటాయని చారుసిన్హా హెచ్చరించారు.

# కర్ణాటక డీజీపీ స్థాయి అధికారి రాసలీలలు



## ఆఫీసులోనే మహిళలతో శృంగార చేష్టలు
## వీడియోలతో సహా దొరికిపోయిన వైనం
## సస్పెన్షన్ వేటు వేసిన కర్నాటక ప్రభుత్వం

కర్ణాటకలో సివిల్ రైట్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ డీజీపీగా సేవలందిస్తున్న కె.రామచంద్ర రావును సస్పెండ్ చేసింది. మీడియాలో వైరల్ అవుతోన్న కొన్ని వీడియోల్లో రామచంద్ర రావు మహిళలతో అనుచితంగా ప్రవర్తిస్తున్నట్టు ఉండటంతో ఈ మేరకు సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసింది. రామచంద్ర రావు ప్రభుత్వ ఉద్యోగిగా నిబంధనలు ఉల్లంఘించారని ప్రభుత్వం జారీ చేసిన సస్పెన్షన్ ఉత్తర్వుల్లో పేర్కొంది. సస్పెన్షన్ సమయంలో ప్రభుత్వ అనుమతి లేకుండా రామచంద్ర రావు హెడ్‌క్వార్టర్స్‌ను విడిచి వెళ్లకూడదని కూడా ఆదేశించింది. కె.రామచంద్ర రావు రాసలీలల వీడియోలు బహిర్గతం కావడం ఆ రాష్ట్రంలోనే కాదు, దేశ వ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. తన ఆఫీసులోనే, పోలీస్ డ్రెస్సుతో యువతులతో ఆ సీనియర్ ఐపీఎస్ అధికారి సరసాలాడటం పట్ల తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ రైట్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (డీసీఆర్ఈ) డీజీపీ రామచంద్ర రావు శృంగార చేష్టల వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. యూనిఫామ్‌లో ఉన్న ఆయన తన ఛాంబర్‌లోనే యువతులను కౌగిలించుకుంటూ, ముద్దులు పెట్టే దృశ్యాలు ఆ వీడియోల్లో చూసి అంతా అవాక్కయ్యారు. వివిధ సందర్భాల్లో తీసిన ఆ వీడియోల్లో ఉన్న ముగ్గురు యువతుల్లో ఒకరు మోడల్ అని తెలుస్తోంది. డీజీపీ రాసలీలల వీడియోలపై స్థానిక మీడియా ఛానళ్లలో ప్రత్యేక కథనాలు హోరెత్తాయి. వీడియోలు వైరల్ అయిన తర్వాత పోలీస్ శాఖలోనూ తీవ్ర చర్చకు దారితీసింది. అయితే.. ఆ వీడియోలు మార్ఫింగ్ చేసినవని.. రామచంద్ర రావు మీడియాతో చెప్పుకొచ్చారు. ఇది తన పరువుకు భంగం కలిగించేందుకు చేసిన కుట్ర అని ఆరోపించారు. ఆ వీడియోలు 8 ఏళ్ల క్రితం నాటివని, ఆ సమయంలో తాను బెళగావిలో

ఉన్నానన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు చెందిన రామచంద్ర రావు 1993 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. 2023లో ఆయన డీజీపీగా పదోన్నతి పొందారు. వచ్చే జూన్‌లో ఆయన రిటైర్ కానున్నారు. ఆయన పదవీ కాలంలో పలుమార్లు వివాదాల్లో చిక్కుకున్నారు. ఆయన పెంపుడు కూతురు, సినీనటి రన్యారావ్ దుబాయ్ నుంచి పలుమార్లు బంగారాన్ని అక్రమంగా తీసుకొచ్చిన విషయం గతంలో దేశవ్యాప్తంగా సంచలనమైంది. ఎయిర్‌పోర్టు నుంచి రన్యారావ్ ఎలాంటి చెకింగ్ లేకుండా ప్రొటోకాల్ ద్వారా బయటకు వచ్చేందుకు పోలీస్ వాహనాన్ని వినియోగించారు. ఈ కేసును సిట్ అధికారులు దర్యాప్తు జరిపారు. ఈ క్రమంలో డీజీపీపై అప్పట్లో సస్పెన్షన్ వేటు పడింది. గతేడాది చివర్లో మరోసారి రామచంద్ర రావుకు పోస్టింగ్ ఇచ్చారు. పోలీస్ హౌసింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఎండీగా పనిచేసిన సమయంలోనూ ఆయన కేసులు, అంతర్గత విచారణలు ఎదుర్కొన్నారు. దక్షిణ రేంజ్ ఐజీపీగా ఉన్నప్పుడు ఓ కేసులో పట్టుబడ్డ డబ్బులో పెద్ద మొత్తం మాయం చేశారనే ఆరోపణలూ రామచంద్రరావుపై రావడం గమనార్హం.



# కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థలకే స్లీపర్ బస్సుల తయారీ

## ప్రమాదాల నివారణకు కేంద్రం సరికొత్త ఆలోచన

## కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి

పలు రాష్ట్రాల్లో జరిగిన ఘోర బస్సు ప్రమాదాల్లో పెద్ద సంఖ్యలో ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో వీటి నివారణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై స్థానికంగా పనిచేసే మాన్యువల్ స్లీపర్ బస్సు బాడీ బిల్డర్లకు కాకుండా.. కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆటోమొబైల్ కంపెనీలు, తయారీ సంస్థలకే బస్సుల తయారీకి అనుమతి ఉంటుందని కేంద్ర రోడ్డు రవాణా శాఖ ప్రకటన జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ సహా పలు రాష్ట్రాల్లో జరిగిన బస్సు ప్రమాదాల్లో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఈ బస్సు ప్రమాదాలకు అనేక కారణాలు ఉన్నాయని నివేదికల్లో తేలిందన్నారు. భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం, అగ్నిప్రమాదం జరిగిన సమయాల్లో మంటలను నియంత్రించేందుకు అవసరమైన పరికరాలు బస్సుల్లో లేకపోవడం కూడా ప్రాణనష్టానికి కారణమైందని చెప్పారు. అలాగే బస్సుల్లో తరచూ తనిఖీలు చేపట్టకపోవడం కూడా మరో కారణమని నివేదికల్లో తేలిందని చెప్పారు. మరోసారి ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. బస్సు ప్రమాదాల నివారణకు కేంద్ర ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన సంస్థలు మాత్రమే బస్సులను తయారు చేయాలనే నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఇప్పుడు ఉన్న అన్ని స్లీపర్ బస్సుల్లో అగ్నిప్రమాద గుర్తింపు వ్యవస్థ, ప్రతి ఎమర్జెన్సీ ఎగ్జిట్ వద్ద సుత్తి, అత్యవసర లైటింగ్ వంటి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘించే బస్సులు, అలాగే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేసే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆదేశించారు. దేశంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆధునిక సాంకేతికతను వినియోగించేందుకు చర్యలు చేపట్టినట్లు కేంద్రమంత్రి తెలిపారు. కార్లలో ఉచిత స్పెక్ట్రమ్‌ను ఉపయోగించి వాహనం నుంచి వాహనానికి (వి2వి) కమ్యూనికేషన్ టెక్నాలజీని ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు వెల్లడించారు.

# 5,582 మంది చిన్నారులకు విముక్తి

## మహిళా భద్రతా విభాగం అదనపు డీజీపీ చారుసిన్హా

బాలకార్మికులను, తప్పిపోయిన చిన్నారుల గుర్తించడమే లక్ష్యంగా తెలంగాణలో నెల రోజుల పాటు నిర్వహించిన ఆపరేషన్ స్మైల్ ద్వారా 5,582 మంది చిన్నారులకు విముక్తి కల్పించారు. జనవరి 1నుంచి 31 వరకు ఆపరేషన్ స్మైల్ స్పెషల్ డ్రైవ్స్ నిర్వహించామని మహిళా భద్రతా విభాగం అదనపు డీజీపీ చారుసిన్హా తెలిపారు. 121 సబ్ డి విజనల్ పోలీసు బృందాలు ఇందులో పాల్గొన్నాయని, మహిళా శిశు సంక్షేమశాఖ, కార్మిక ఆరోగ్య శాఖలతో పాటు చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు భాగస్వాములయ్యాయని ఆమె వివరించారు. 15 రాష్ట్రాలకు చెందిన 474మంది బాలికలను కాపాడామన్నారు. 4,567మంది బాల కార్మికులుగా పనిచేస్తుండగా, 486 మంది వీధి బాలలుగా తిరుగుతున్నారని, 38మంది భిక్షాటన చేస్తున్నారని, మరో 491మంది ఇతర పనుల్లో మగ్గిపోతున్నారని చారుసిన్హా తెలిపారు. 1480 కేసులు నమోదు చేసి, 1483మంది నిందితులను అరెస్టు చేశామని, రూ.41.78లక్షల జరిమానా విధించామన్నారు. తాము రక్షించిన వారిలో 43మంది నేపాల్‌కు చెందిన పిల్లలున్నారని, మొత్తం 4,978మందిని తల్లిదండ్రుల చెంతకు చేర్చామని, మిగిలిన 604మందిని రక్షణ గృహాలకు తరలించి ఆశ్రయం కల్పించామని చారుసిన్హా వెల్లడించారు.




చదువు కోవాలని ఉన్నా తప్పని పొట్టతిప్పలు

# కొల్లం స్పోర్ట్స్ హాస్టల్‌లో ఇద్దరు బాలికల ఆత్మహత్య..

కొల్లంలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా హాస్టల్ గదిలో ఇద్దరు స్పోర్ట్స్ ట్రైనీలు ఉరివేసుకుని మరణించారు. కోజికోడ్‌కు చెందిన 17 బాలిక, తిరువనంతపురానికి చెందిన 15 ఏళ్ల బాలిక ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఉదయం ట్రైనింగ్ సెషన్‌కు ఆ ఇద్దరు బాలికలు హాజరు కాకపోవడంతో బాలికల రూమ్‌కు వెళ్లి పదేపదే తలుపు తట్టినా సమాధానం రాకపోవడంతో హాస్టల్ అధికారులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న అధికారులు తలుపు పగలగొట్టి చూశారు. గదిలో ఇద్దరు బాలికలు ఉరివేసుకుని కనిపించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. కోజికోడ్‌కు చెందిన 17 ఏళ్ల బాలిక అథ్లెటిక్ ట్రైనీ కాగా.. పదో తరగతి చదువుతోంది. అలాగే 15 ఏళ్ల బాలిక కబడ్డీ క్రీడాకారిణి. ఆమె పదో తరగతి చదువుతోంది. గదిలో ఎలాంటి సూసైడ్ నోట్ లభించలేదని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# లెక్చరర్ లైంగిక వేధింపులు.. యువతి మృతి

కాలేజీ లెక్చరర్, ముగ్గురు విద్యార్థినుల వేధింపులకు 19 ఏళ్ల యువతి మృతి చెందింది. మానసికంగా వేదనకు గురై..దాదాపు రెండు నెలల పాటు మృత్యువుతో పోరాడి.. చివరకు ప్రాణాలు విడిచింది. ఈ విషాద ఘటన హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలోని ధర్మశాలలో జరిగింది.

కాలేజీ లెక్చరర్, ముగ్గురు యువతులు ర్యాగింగ్, లైంగిక వేధింపుల కారణంగా 19 ఏళ్ల యువతి మృతి చెందింది. గతేడాది సెప్టెంబర్ నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ డిసెంబర్ 26న మరణించింది. విద్యార్థిని మృతికి కారణమైన లెక్చరర్‌తో పాటు ముగ్గురు విద్యార్థినులపై తాజాగా ధర్మశాల పోలీసులు కేసు నమోదు చేశారు. భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్లు 75, 115(2) మరియు 3(5) కింద, అలాగే హిమాచల్ ప్రదేశ్ విద్యా సంస్థలలో ర్యాగింగ్ నిషేధ చట్టంలోని సెక్షన్ 3 కింద పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మృతురాలి తండ్రి.. పోలీసుల ఫిర్యాదులో తెలిపిన వివరాల ప్రకారం..

హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం ధర్మశాలలోని ప్రభుత్వ కాలేజీలో పల్లవి అనే 19 ఏళ్ల యువతి

డిగ్రీ చదువుతుంది. గతేడాది సెప్టెంబర్ 18న ఆమెపై అదే కాలేజీలో పనిచేసే లెక్చరర్ తో పాటు ముగ్గురు తోటి విద్యార్థులు ర్యాగింగ్, లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. తన కుమార్తెపై శారీరకంగా దాడి చేసి, బెదిరించారని బాధితురాలి తండ్రి పేర్కొన్నాడు. కళాశాలలో ఒక ప్రొఫెసర్ తమ కుమార్తె పట్ల అసభ్యకరమైన చర్యలకు పాల్పడ్డారని కూడా ఫిర్యాదులో మృతురాలి తండ్రి ఆరోపించారు. వారి వేధింపులు, బెదిరింపుల కారణంగా తన కుమార్తె భయపడి, మానసికంగా కుంగిపోయిందని, దానివల్ల ఆమె ఆరోగ్యం క్షీణించిందని పోలీసులకు తెలిపాడు. ఆమె ఆరోగ్య పరిస్థితి మరింత దిగజారడంతో, హిమాచల్‌లోని వివిధ ఆసుపత్రులలో ఆమెకు చికిత్స అందించినట్లు ఆయన చెప్పాడు. ఆ తర్వాత ఆమెను లుధియానాలోని దయానంద్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పల్లవి 2025 డిసెంబర్ 26న మరణించింది. తన కుమార్తె చాలా కాలం పాటు తీవ్ర అనారోగ్యంతో, మానసిక వేదనతో ఉన్నందున, తాను ఈ విషయాన్ని ఇంతకు ముందు పోలీసులకు ఫిర్యాదు చేయలేకపోయానని మృతురాలి తండ్రి చెప్పాడు. ఆమె మరణంతో కుటుంబం కూడా తీవ్ర దిగ్భ్రాంతికి గురైందని, అందుకే ఫిర్యాదు చేయడంలో ఆలస్యం జరిగిందని ఆయన వెల్లడించాడు. ఫిర్యాదును పరిశీలించి, ప్రాథమిక విచారణ జరిపిన తర్వాత ముగ్గురు విద్యార్థులు, సదరు లెక్చరర్ పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# ఏపీలో ఏడేళ్ల చిన్నారిపై లైంగిక దాడి

తిరుపతి రూరల్ పరిధిలో దారుణ సంఘటన చోటు చేసుకుంది. చాక్లెట్ ఆశ చూపించి ఏడేళ్ల గిరిజన చిన్నారిపై ఓ కామాంధుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ దుశ్చర్యకు పాల్పడిన నాగరాజును తిరుచానూరు పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతి రూరల్‌కి చెందిన దంపతులు రోజువారి కూలీ పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వారికి ఏడేళ్ల చిన్నారి ఉంది. ఈ క్రమంలో రోజు వారిగానే కూలీ పనులకు వెళ్లగా.. వారి కుమార్తె ఇంటి వద్ద ఆడుకుంటోంది. ఓ వ్యక్తి ఏడేళ్ల చిన్నారిని చాక్లెట్ ఇస్తానని ఆశ చూపించి ఇంటి లోపలకి తీసుకెళ్లి ఈ దుశ్చర్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఈ విషయాన్ని గమనించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుచానూరు పోలీసులు నిందితుడు నాగరాజును అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిపై సీఐ సునీల్ కుమార్ కేసు నమోదు చేసి పోక్సో చట్టం ప్రకారం దర్యాప్తు ప్రారంభించి బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పోక్సో చట్టం కింద దర్యాప్తు పూర్తిగా న్యాయ పరంగా జరుగుతోందని వెల్లడించారు.

# అరకులోయ ఆస్పత్రి బాత్రూమ్‌లో మృత శిశువు కలకలం

అరకులోయ ఏరియా  ప్రభుత్వాసుపత్రిలోని లేడీస్ బాత్‌రూమ్‌లో ఒక నవ జాతి శిశువు మృతదేహం తీవ్ర కలకలం రేపింది. గుర్తు తెలియని మహిళ మృత శిశువుకు జన్మనిచ్చిందా లేదా ప్రసవం తర్వాత చనిపోయిందా అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది. బాత్ రూమ్ క్లీన్ చేయడానికి వెళ్లిన కార్మికురాలు శిశువును చూసి కేకలు వేయడంతో విషయం బయటకు వచ్చింది. వెంటనే ఆసుపత్రి సూపరింటెండెంట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఆసుపత్రి ఎంట్రెన్స్, చుట్టుపక్కల ప్రదేశాల్లో సీసీటీవీ కెమెరాలు పరిశీలిస్తున్నారు.  సదరు గర్భిణి బాత్ రూమ్‌కి వెళ్లి అక్కడే ప్రసవించినట్లు సమాచారం. శిశువు మరణించడంతో ఆందోళనకు గురై వదిలేసి పరారైనట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

## గర్భంతో ఉన్న మహిళా కమాండోను కొట్టి చంపిన భర్త

ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ స్వాత్‌లో కమాండోగా పనిచేస్తున్న కాజల్ చౌదరి (27), తన భర్త చేతిలోనే దారుణ హత్యకు గురయ్యారు. ఈ ఘటనకు సంబంధించి కలిచివేసే వివరాలు ఇలా ఉన్నాయి. ఈ హత్యకు సంబంధించి అత్యంత భయంకరమైన విషయం ఏమిటంటే, నిందితుడు అంకుర్ చౌదరి తన భార్యను చంపుతున్న సమయంలో ఆమె(కాజల్) సోదరుడు నిఖిల్ (ఈయన కూడా ఢిల్లీ పోలీస్ కానిస్టేబుల్)కు ఫోన్ చేశాడు. 'ఈ కాల్ రికార్డ్ చేసుకో, ఇది పోలీసులకు సాక్ష్యంగా పనికొస్తుంది.. నేను నీ చెల్లిని చంపేస్తున్నా' అని చెప్పి, ఆమెపై దాడికి దిగాడు. ఫోన్ లైన్‌లో ఉండగానే కాజల్ ఆర్తనాదాలు విన్న నిఖిల్ నిస్సహాయ స్థితిలో ఉండిపోయాడు. ఐదు నిమిషాల తర్వాత మళ్లీ ఫోన్ చేసి 'తను చనిపోయింది, వచ్చి తీసుకెళ్లు' అని చెప్పడం గమనార్హం. జనవరి 22న ఢిల్లీలోని మోహన్ గార్డెన్ ప్రాంతంలో కాజల్-అంకుర్ నివాసంలో ఈ ఘటన జరిగింది. భర్త.. నిందితుడైన అంకుర్ తన భార్య కాజల్ తలని తలుపు ఫ్రేమ్‌కు బలంగా కొట్టి, ఆపై బరువైన డంబెల్‌తో ఆమె తలపై దాడి చేశాడు.

దాడి సమయంలో కాజల్ నాలుగు నెలల గర్భిణీ. ఆసుపత్రిలో ఐదు రోజులపాటు మృత్యువుతో పోరాడి, జనవరి 27న కమాండో కాజల్ కన్నుమూశారు. కట్నం వేధింపులే తమ బిడ్డ హత్యకు ప్రధాన కారణమని కాజల్ కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. నిందితుడు

అంకుర్ చౌదరి కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖలో క్లర్కుగా పనిచేస్తున్నాడు. పెళ్లిలో బుల్లెట్ బైక్, బంగారం ఇచ్చినప్పటికీ, కారు ఇవ్వలేదని అతను తరచూ కాజల్‌ను వేధించేవాడని తెలుస్తోంది. పోలీసులు.. నిందితుడు అంకుర్ చౌదరిని అరెస్ట్ చేసి తీహార్ జైలుకు పంపారు. ముందుగా హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు.. కాజల్ మరణం తర్వాత దానిని హత్య కేసుగా మార్చారు. కాజల్-అంకుర్ దంపతులకు ఇప్పటికే ఏడాదిన్నర వయసున్న కుమారుడు ఉన్నాడు. ప్రస్తుతం ఆ బాబు కాజల్ తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు.

# కోరిక తీర్చలేదని సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిని హతమార్చిన కిరాతకుడు

సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిపై ఓ యువకుడు దారుణానికి ఒడిగట్టాడు. రాత్రి వేళ ఆమె ఇంట్లోకి ప్రవేశించిన అతడు.. తన కోరిక తీర్చమని బలవంతపెట్టాడు. ఆమె కాదనటంతో ఘాతుకానికి పాల్పడ్డాడు. ఆమె గొంతు నులిమి చంపేశాడు. ఈ సంఘటన బెంగళూరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బెంగళూరుకు చెందిన 34 ఏళ్ల డీకే షర్మిళ అనే యువతి ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేస్తోంది. రామమూర్తి నగర్, సుబ్రమణి లేఅవుట్‌లో ఓ ఫ్లాట్ అద్దెకు తీసుకుని ఉంటోంది. షర్మిళ పక్క ఫ్లాట్‌లో కర్నల్ కురయ్ అనే యువకుడు ఉంటున్నాడు. కర్నల్ కన్ను షర్మిళపైన పడింది. ఎలాగైనా ఆమెతో తన కోరిక తీర్చుకోవాలని అనుకున్నాడు. సరైన సమయం కోసం ఎదురుచూస్తూ ఉన్నాడు. జనవరి 3న రాత్రి 9 గంటలకు షర్మిళ ఇంట్లోకి ప్రవేశించాడు. కిటికీ ద్వారా అతడు ఇంట్లోకి చొరబడ్డాడు. నేరుగా షర్మిళ దగ్గరకు వెళ్లి తన కోరిక తీర్చమని అడిగాడు. ఆమె ఇందుకు ఒప్పుకోలేదు. దీంతో ఆగ్రహానికి గురైన కర్నల్ ఆమె నోరు, గొంతు గట్టిగా నొక్కిపట్టాడు. ఊపిరి ఆడకపోవటంతో ఆమె స్పృహకోల్పోయింది. అతడి నుంచి తప్పించుకునే ప్రయత్నంలో ఆమెకు గాయాలు కూడా అయ్యాయి. షర్మిళ చనిపోయిందని భావించిన కర్నల్ ఆధారాలను నాశనం చేయాలని అనుకున్నాడు. షర్మిళ బట్టలు, ఇతర వస్తువుల్ని బెడ్‌పై పడేసి నిప్పుపెట్టాడు. తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కొద్దిసేపటి తర్వాత షర్మిళ చనిపోయింది. ఇంట్లోంచి పొగలు రావటం గుర్తించిన పొరిగింటి వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటల్ని ఆర్పారు. బెడ్‌రూములో షర్మిళ విగతజీవిగా కనిపించింది. అగ్నిమాపక సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు షర్మిళ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పొగ కారణంగా ఆమె ఊపిరి ఆడక చనిపోయి ఉంటుందని పోలీసులు మొదట భావించారు. సైంటిఫిక్ పద్ధతులు, టెక్నికల్ ఆధారాలతో కర్నల్ ఈ హత్యకు పాల్పడినట్లు కనుగొన్నారు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నాడు.

# మహిళా హంతకుడిని పట్టించిన ఆమ్లెట్ ముక్క

మధ్యప్రదేశ్ గ్వాలియర్‌లో జరిగిన మహిళ హత్య కేసును పోలీసులు ఓ చిన్న ఆమ్లెట్ ముక్క ఆధారంగా ఛేదించారు. ఏఐ సాంకేతికత, సీసీటీవీ ఫుటేజ్ సాయంతో నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశారు. ఈ కేసు దర్యాప్తులో ఆమ్లెట్ ముక్క కీలక ఆధారంగా మారింది. వివరాల్లోకి వెళితే.. డిసెంబర్ 29న గ్వాలియర్‌లోని కటారే ఫామ్ హౌస్ దగ్గర పొదల్లో ఓ మహిళ శవం వెలుగుచూసింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మహిళ మృతదేహం అర్ధనగ్నంగా ఉంది. ముఖం మొత్తం రాయితో కొట్టడంతో గుర్తుపట్టలేనంతగా ఛిద్రమైంది. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. చనిపోయే ముందు మహిళపై అత్యాచారం జరిగినట్లు పోస్టుమార్టం రిపోర్టులో తేలింది. పోలీసులు ఏఐ సాయంతో మహిళ ముఖాన్ని క్రియేట్ చేశారు. ఏఐతో తయారు చేసిన ఫొటో సాయంతో ఆ మహిళ ఎవరో గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ఇలాంటి సమయంలో ఆమ్లెట్ ముక్క ఈ కేసును మలుపు తిప్పింది. మృతురాలు చనిపోయినప్పుడు స్వెటర్ ధరించి ఉంది. ఆ స్వెటర్ జేబులో చిన్న ఆమ్లెట్ ముక్క దొరికింది. పోలీసులు దాని సాయంతో కేసును ముందుకు నడిపించారు. ఆమ్లెట్‌లు తయారు చేసి అమ్మే వారి దగ్గరకు వెళ్లారు. మహిళ ఫొటో చూపించి ఎంక్వైరీ చేశారు. ఓ వ్యాపారి.. ఆ మహిళ, మరో ఇద్దరు వ్యక్తులతో తన షాపులోనే ఆమ్లెట్ తిన్నదని చెప్పాడు.

పోలీసులు షాపు దగ్గరలోని సీసీటీవీ కెమెరాలను పరిశీలించి హజీరా ఏరియాకు చెందిన సచిన్ సేన్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతడ్ని విచారించగా అసలు విషయం బయటపడింది. అతడు ఏం చెప్పాడంటే.. తికమ్‌ఘర్‌కు చెందిన ఆ మహిళతో కొన్ని నెలల క్రితం సచిన్‌కు పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. అయితే, ఆమె తనతోనే కాకుండా వేరే వాళ్లతో కూడా సన్నిహితంగా ఉందని సచిన్ అనుమానం పెంచుకున్నాడు. ఆ అనుమానంతోనే ఆమెను చంపేశాడు. ఆమ్లెట్ తిన్న తర్వాత మహిళను నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లాడు. అక్కడ ఆమెపై అత్యాచారం చేసి, గొంతు నులిమి చంపేసి ఆమె ముఖాన్ని బండరాయితో గుర్తుపట్టలేనంతగా ఛిద్రం చేశాడు. పోలీసులు సచిన్‌ను అదుపులోకి తీసుకున్నారు.

# ప్రియుడిపై మోజుతో భర్తను దారుణంగా చంపిన భార్య

## వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని తమ్ముడితో కలిసి దారుణం

ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండల పరిధిలో వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడనే కారణంగా భర్తను తమ్ముడి సాయంతో కళ్లలో కారం కొట్టి ఓ భార్య హత్య చేసిందని డీఎస్పీ నాగరాజు తెలిపారు. దోర్నాలకు చెందిన అడపాల లాలు శ్రీను(38)కు సున్నిపెంటకు చెందిన ఝాన్సీకి 17ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు సంతానం. లాలు శ్రీను లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. ఈ క్రమంలో రెండు నెలల క్రితం గంజాయి విక్రయిస్తూ పట్టుబడి ఒంగోలు జైలులో రిమాండ్‌లో ఉన్నాడు. అప్పటికే నిందితురాలు ఝాన్సీకి తమ్ముడి స్నేహితుడు జమ్మిదోర్నాలకు చెందిన కారు డ్రైవర్ సూర్యనారాయణతో వివాహేతర సంబంధం కొనసాగుతోంది. రిమాండ్‌లో ఉన్న శ్రీనుని కలిసేందుకు వెళ్లిన భార్యను, ఆమె తమ్ముడిని బయటకు వచ్చి చంపేస్తానంటూ బెదిరించారు. ఈ నేపథ్యంలో తానే అతన్ని చంపాలని నిర్ణయించుకుని గుంటూరుకు చెందిన మరో నలుగురితో రూ. రెండు లక్షలు సుపారీ ఇచ్చేలా ఝాన్సీ ఒప్పందం చేసుకుంది. ఒంగోలు నుంచి బెయిల్‌పై వస్తున్న క్రమంలో ముందుగా అనుకున్న ప్రకారం చీమకుర్తి వద్దగానీ, పొదిలి వద్దగానీ చంపాలనుకుంటే కుదరలేదు. చివరకు పెద్దారవీడు అంకాలమ్మ గుడి సమీపంలో మూత్ర విసర్జనకు కారు ఆపాలని కోరారు. కారులో భార్య ఝాన్సీ, ఆమె తమ్ముడు పథకం ప్రకారం వేచి ఉండగా వెనుక బండిపై వచ్చిన సూర్యనారాయణ, అతని స్నేహితులు మృతుడి కళ్లలో కారం కొట్టగా, కారులో వెంటతెచ్చుకున్న కత్తితో భార్య, ఆమె తమ్ముడు పొడిచారు. దీంతో లాలుశ్రీను అక్కడికక్కడే మృతి చెందాడు. మీరిద్దరూ లొంగిపోతే మేం బయట ఉండి బెయిల్‌పై తెస్తామని ఇతర నిందితులు వారికి చెప్పారు. దీంతో ఝాన్సీ, ఆమె తమ్ముడు పోలీసులకు సమాచారం ఇచ్చి లొంగిపోయారు.

## ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య

గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం చిలువూరుకు చెందిన శివనాగరాజు (45), లక్ష్మీ మాధురికి 2007లో వివాహం జరిగింది. శివనాగరాజు ఉల్లిపాయల వ్యాపారం చేసేవాడు. విజయవాడలోని ఓ సినిమా థియేటర్‌లో మాధురి కొన్ని రోజులు పనిచేసింది.

ఆ సమయంలో సత్తెనపల్లికి చెందిన గోపి అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం వివాహేతర సంబంధానికి దారితీసింది. హైదరాబాద్‌లో ట్రావెల్స్ నడిపేవాడు గోపి. శివనాగరాజుకి డ్రైవింగ్ రావడంతో ఉల్లిపాయల వ్యాపారం మానిపించి గోపి వద్ద డ్రైవర్‌గా ఉద్యోగానికి పంపింది మాధురి. దీంతో కాపురాన్ని హైదరాబాద్‌కి మార్చారు. ఒకరోజు గోపి, మాధురి ఒంటరిగా గడపడం శివనాగరాజు కంటపడింది. వెంటనే భార్యతో కలిసి తిరిగి చిలువూరికి వెళ్లాడు. గోపితో మాట్లాడొద్దని గట్టిగా హెచ్చరించాడు. కానీ, గోపితో ఆమె వివాహేతర సంబంధం కొనసాగించింది. దీంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరిగాయి. శివనాగరాజుది ఉల్లిపాయల వ్యాపారం కావడంతో ఇంటి వద్దే ఉండేవాడు. తమ అక్రమ సంబంధానికి భర్త అడ్డు వస్తున్నాడని భావించిన మాధురి తన ప్రియుడు గోపితో కలిసి దారుణమైన ప్లాన్ వేసింది. జనవరి 18న శివనాగరాజు చేసే భోజనంలో నిద్రమాత్రలు కలిపి పెట్టింది. గాఢ నిద్రలోకి జారుకున్న భర్తను తన ప్రియుడు గోపితో కలిసి హత్య చేసింది. ప్రియుడు అక్కడ నుంచి వెళ్లిపోయాక, రాత్రి మొత్తం నీలి చిత్రాలు చూస్తూ గడిపింది. ఉదయం ఏమీ తెలియనట్టు తన భర్త గుండెపోటుతో చనిపోయాడని నాటకం మొదలు పెట్టింది. మాధురి వ్యవహారం కుటుంబసభ్యులు, చుట్టుపక్కల వారికి తెలియడంతో అనుమానాలు వచ్చాయి. అలాగే శివనాగరాజు ఒంటిపై గాయాలు కనిపించాయి. దీంతో మృతుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణలో తన ప్రియుడితో కలిసి హత్య చేసినట్లు వెల్లడించింది మాధురి. నిందితుడు గోపి పరారీలో ఉండగా అతని కోసం గాలింపు మొదలు పెట్టారు.

# హర్యానాలో మహిళపై గ్యాంగ్‌రేప్

హర్యానాలోని బహదూర్‌గఢ్‌లో దారుణం చోటుచేసుకుంది. ఓ మహిళ(42)పై ఐదుగురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆమె ప్రయాణిస్తున్న బస్సును ఫాలో అయి.. తోడుగా ఉన్న బంధువుల నుంచి ఆమెను ఎత్తుకెళ్లి గ్యాంగ్ రేప్‌కు పాల్పడ్డారు. జనవరి 12న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన మహిళ ఉద్యోగం కోసం బాబాయితో కలిసి ఢిల్లీకి వచ్చింది. 12వ తేదీ అర్ధరాత్రి 2 గంటలకు ఢిల్లీలోని పండిట్ శ్రీరామ్ శర్మ మెట్రోస్టేషన్ వద్ద బస్సు నుంచి దిగింది. అక్కడి నుంచి వారిద్దరినీ తీసుకెళ్లేందుకు ఆమెకు వరుసకు సోదరుడయ్యే వ్యక్తి వచ్చాడు. అప్పటివరకు బస్సును ఫాలో అయిన ఐదుగురు.. మహిళను ఆమె బాబాయి, సోదరుడి నుంచి ఎత్తుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డారు. పోలీసులు 8గంటల వ్యవధిలోనే నలుగురు నిందితులను అరెస్టు చేశారు.

# ఆత్మహత్య చేసుకునేందుకు భార్య నిప్పంటించుకుంటే వీడియో తీసిన భర్త

ఆత్మహత్య చేసుకునేందుకు భార్య ఒంటిపై డీజిల్ పోసుకొన్నా ఆ భర్త అడ్డుకోలేదు.. ఆపై ఒంటికి నిప్పంటించుకున్నా ఆమెను కాపాడేందుకు ప్రయత్నించలేదు. పైపెచ్చు.. ఆమె బలవన్మరణం వెనుక తన పాత్రేమీ లేదనే సాక్ష్యం సిద్ధం చేసేందుకు ఘటనంతా పక్కనే ఉండి సెల్‌ఫోన్‌లో వీడియో తీశాడు! సభ్యసమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేసే ఈ ఘటన సూరత్‌లో జరిగింది. మృతురాలు 31ఏళ్ల ప్రతిమా దేవి. ఆమె భర్త 31 ఏళ్ల రంజిత్ షా. వీరిది బిహార్. రంజిత్ వరుసకు సోదరుడయ్యే వ్యక్తికి, ప్రతిమ సోదరికి పెళ్లి జరగడంతో ఇరు కుటుంబాలకు బంధుత్వం ఏర్పడింది. కొన్నాళ్ల రాకపోకల తర్వాత రంజిత్-ప్రతిమ మధ్య ఏర్పడిన పరిచయం, ప్రేమకు దారితీసింది. ఇద్దరి పెళ్లికి ఇంట్లో వాళ్లు ఒప్పుకోకపోవడంతో 2013లో ప్రతిమ-రంజిత్ సూరత్‌కు పారిపోయి పెళ్లి చేసుకున్నారు. ఈ దంపతులకు ముగ్గురు పిల్లలు. రంజిత్ మెకానిక్. ప్రతిమ ఇంట్లోనే ఉంటూ పిల్లలను చూసుకునేది. మూడోబిడ్డ పుట్టాక భార్యాభర్తల మధ్య గొడవలు మొదలయ్యాయి. జనవరి 4న పొరుగింటివారు మేడ మీద ఆరబెట్టిన గోధుమలను రంజిత్ పిల్లలు చిందరవందర చేశారు. పిల్లలను రంజిత్ తిట్టి బయటకు వెళ్లనీయకుండా బంధించాడు. ప్రతిమ వారించినా రంజిత్ వినిపించుకోలేదు. ఈ విషయంలో భార్యాభర్తలు గొడవ పడ్డారు. ఈ క్రమంలో క్యాన్‌లో డీజిల్ తెచ్చిపెట్టానని.. ఒంటిమీద పోసుకొని, నిప్పంటించుకొని చచ్చిపో అంటూ భార్యను రంజిత్ రెచ్చగొట్టాడు. అతడి మాటలకు తీవ్ర మనస్తాపం చెందిన ప్రతిమ అలానే చేసింది. మంటలతో తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ప్రతిమ 11న మృతిచెందింది. ఆమె ఆత్మహత్య ఘటనలో తన ప్రమేయం లేదని, తనకు తానుగా ఆమె ఒంటిపై డీజిల్ పోసుకొని నిప్పంటించుకుందని చెబుతూ రుజువుగా రంజిత్ తీసిన వీడియోనే అతడి మెడకు చుట్టుకుంది. పోలీసులు రంజిత్‌ను అదుపులోకి తీసుకున్నారు.

# 12 ఏళ్ల తర్వాత పోలీసులకు చిక్కిన పోక్సో కేసు ముద్దాయి

విశాఖ టూటౌన్ పోలీసులు 12 ఏళ్ల తర్వాత పోక్సో కేసులో ముద్దాయిగా ఉన్న ఓ వ్యక్తిని పట్టుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లో దాక్కున్న అతడ్ని స్థానిక పోలీసుల సాయంతో

అదుపులోకి తీసుకున్నారు. 12 ఏళ్ల క్రితం విశాఖపట్నానికి చెందిన సల్మాన్ అనే వ్యక్తి ఓ బాలికపై అత్యాచారం చేశాడు. అనంతరం విశాఖను వదిలి పరారయ్యాడు. ఈ నేపథ్యంలో కోర్టు అతడిపై వారెంట్ జారీ చేసింది. పోలీసులు అతడి కోసం తీవ్రంగా అన్వేషిస్తున్నారు. ఇంతలో నిందితుడు సల్మాన్ ఉత్తరప్రదేశ్‌లో తలదాచుకుంటున్నట్టు తెలిసింది. దీంతో విశాఖ టూటౌన్ పోలీసులు అక్కడికి వెళ్లి స్థానిక పోలీసుల సాయంతో నిందితుణ్ని అదుపులోకి తీసుకున్నారు.

# కువైట్‌లో డ్రగ్స్ అక్రమ రవాణా ఇద్దరు భారతీయులకు మరణశిక్ష

## అమెరికాలోనూ 140 కిలోల కొకైన్ రవాణాచేస్తూ పట్టుబడిన ఇద్దరు భారతీయులు

మాదకద్రవ్యాల అక్రమరవాణాకు పాల్పడుతున్న ఇద్దరు భారతీయులకు కువైట్ కోర్టు మరణ శిక్ష విధించింది. పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో వారి వద్ద పద్నాలుగు కిలోల హెరాయిన్, ఎనిమిది కిలోల మెథాంఫెటమైన్ లభ్యమైంది. ఆ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు.. వారిద్దరూ అంతర్జాతీయ మాదకద్రవ్యాల అక్రమ రవాణా నెట్‌వర్క్‌లో భాగమని నిరూపించడంతో న్యాయమూర్తి వారికి మరణశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. మరోవైపు, అమెరికాలోని ఇండియానా రాష్ట్రంలో.. పెద్ద ఎత్తున కొకైన్‌ను రవాణా చేస్తున్న ఇద్దరు భారతీయ ట్రక్ డ్రైవర్లు పోలీసుల హైవే తనిఖీలో అడ్డంగా దొరికిపోయారు. వారి పేర్లు.. గురుప్రీత్ సింగ్ (25), జస్వీర్ సింగ్ (30). వారి వాహనాన్ని ఆపినప్పుడు.. మాదకద్రవ్యాలను పసిగట్టే శునకాలు అందులోని స్లీపర్‌బెర్త్ (డ్రైవర్లు విశ్రాంతి తీసుకునే చోటు)లో డ్రగ్స్ ఉన్నట్టు పసిగట్టాయని, సోదా చేయగా దాదాపు 140 కిలోల కొకైన్ దొరికిందని.. అది దాదాపు లక్షా పదమూడు వేల మంది ప్రాణాలు తీయగలిగేంత ప్రమాదకర పరిమాణమని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ అధికారులు తెలిపారు. వారిద్దరినీ అరెస్టు చేసి జైలుకు తరలించారు. వారిపై మాదకద్రవ్యాల రవాణా కేసు పెట్టామని ఇండియానా పోలీసులు తెలిపారు. వారివద్ద స్వాధీనం చేసుకున్న కొకైన్ విలువ దాదాపుగా రూ.62 కోట్ల దాకా ఉంటుందని అంచనా. వీరిలో గురుప్రీత్ సింగ్ 2017లో, జస్వీర్ సింగ్ 2023లో అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించినట్టు గుర్తించామని.. ఈ నేపథ్యంలో వారిపై డిపోర్టేషన్ హోల్డ్‌లు కూడా పెట్టామని వెల్లడించారు.

# లింగవేతన అంతరం 20%

## మహిళలపై, కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతున్న వేతన అసమానతలు

ప్రపంచవ్యాప్తంగా కార్మికులు జీతం కోసం ఎదురు చూస్తున్నారు. కానీ జీతం ఉపశమనం, సంతృప్తి లేదా ఆనందాన్ని కలిగించవచ్చు, కానీ అది అన్యాయాన్ని కూడా సూచిస్తుంది - పని ప్రదేశంలో పురుషులు మరియు స్త్రీల మధ్య నిరంతర అసమానతలను గుర్తు చేస్తుంది. లింగ వేతన అంతరం 20 శాతంగా ఉంది, అంటే మహిళా కార్మికులు పురుషులు సంపాదించే దానిలో 80 శాతం సంపాదిస్తారు. నల్లజాతి మహిళలు, వలస మహిళలు, వికలాంగులు మరియు పిల్లలు ఉన్న మహిళలకు, ఈ అంతరం ఇంకా ఎక్కువగా ఉంది. వేతన అసమానతల సంచిత ప్రభావం మహిళలు, వారి కుటుంబాలు మరియు సమాజంపై, ముఖ్యంగా సంక్షోభాల సమయంలో, నిజమైన, రోజువారీ ప్రతికూల పరిణామాలను చూపుతుంది. కొవిడ్ విస్తృత ప్రభావాలు 95 మిలియన్ల మందిని తీవ్ర పేదరికంలోకి నెట్టాయి, ప్రపంచవ్యాప్తంగా ప్రతి 10 మంది మహిళల్లో ఒకరు తీవ్ర పేదరికంలో నివసిస్తున్నారు . ప్రస్తుత ధోరణులు ఇలాగే కొనసాగితే, 2030 నాటికి 342.4



మిలియన్ల మహిళలు మరియు బాలికలు రోజుకు 2.15 డాలర్ల కంటే తక్కువ ఆదాయంతో జీవిస్తారు. ఐఎల్ఓ సమాన వేతన సమావేశం నిర్వచించిన విధంగా సమాన విలువ కలిగిన పనికి సమాన వేతనం అంటే, అన్ని కార్మికులు ఒకేలాంటి పనులకు మాత్రమే కాకుండా సమాన విలువ కలిగిన విభిన్న పనులకు కూడా సమాన వేతనం పొందేందుకు అర్హులు. ఈ వ్యత్యాసం చాలా ముఖ్యమైనది ఎందుకంటే స్త్రీలు మరియు పురుషులు నిర్వహించే ఉద్యోగాలలో వివిధ అర్హతలు, నైపుణ్యాలు, బాధ్యతలు లేదా పని పరిస్థితులు ఉండవచ్చు, అయినప్పటికీ సమాన విలువను కలిగి ఉంటాయి మరియు సమాన వేతనం అవసరం. 2020లో, న్యూజిలాండ్ సమాన వేతన సవరణ బిల్లును ఆమోదించింది , దీని ద్వారా స్త్రీలు మరియు పురుషులకు భిన్నమైన కానీ సమాన విలువ కలిగిన పనికి సమానంగా వేతనం లభిస్తుందని నిర్ధారిస్తుంది, దీర్ఘకాలికంగా తక్కువ వేతనం పొందుతున్న స్త్రీ ఆధిపత్య పరిశ్రమలతో సహా. వేతనం ప్రాథమిక వేతనం కంటే ఎక్కువ అని గుర్తించడం కూడా ముఖ్యం. ఇది సంపాదన యొక్క అన్ని అంశాలను కలిగి ఉంటుంది. ఇందులో ఓవర్ టైం జీతం, బోనస్‌లు, ప్రయాణ భత్యాలు, కంపెనీ వాటాలు, బీమా మరియు ఇతర ప్రయోజనాలు ఉన్నాయి.

## లింగ వేతన అంతరం ఎందుకు కొనసాగుతోంది?

లింగ వేతన అంతరం పాతుకుపోయిన అసమానతల నుండి ఉద్భవించింది. మహిళలు, ముఖ్యంగా వలస వచ్చిన మహిళలు, అనధికారిక రంగంలో అధికంగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీధి అమ్మకం నుండి గృహ సేవ వరకు, కాఫీ షాప్ అటెండెంట్ల నుండి జీవనాధార వ్యవసాయం వరకు మీ చుట్టూ చూడండి. మహిళలు తరచుగా కార్మిక చట్టాల డొమైన్‌ల వెలుపల ఉండే అనధికారిక ఉద్యోగాలను భర్తీ చేస్తారు, తక్కువ జీతం, అసురక్షిత పని వాతావరణాలలో, సామాజిక ప్రయోజనాలు లేకుండా వారిని బంధిస్తారు. మహిళా కార్మికులకు ఈ పేలవమైన పరిస్థితులు లింగ వేతన అంతరాన్ని శాశ్వతం చేస్తాయి. ప్రపంచవ్యాప్తంగా పురుషుల కంటే మహిళలు రోజువారీ సంరక్షణ పనిని మూడు గంటలు ఎక్కువగా చేస్తారు. వంట చేయడం, శుభ్రపరచడం, కట్టెలు మరియు నీరు తీసుకురావడం మరియు పిల్లలు మరియు వృద్ధులను జాగ్రత్తగా చూసుకోవడం వంటి ఇంటి పనులు ఇందులో ఉన్నాయి. సంరక్షణ పని అభివృద్ధి చెందుతున్న కుటుంబాలు, సంఘాలు మరియు ఆర్థిక వ్యవస్థలకు వెన్నెముక అయినప్పటికీ, అది తక్కువగా అంచనా వేయబడింది మరియు తక్కువగా గుర్తించబడింది.

ప్రసూతి  శిక్ష వేతన అసమానతను మరింత తీవ్రతరం చేస్తుంది, పని చేసే తల్లులు తక్కువ వేతనాలను ఎదుర్కొంటున్నారు, స్త్రీకి పిల్లల సంఖ్య పెరిగేకొద్దీ ఈ అసమానత

పెరుగుతుంది. తల్లులకు తక్కువ వేతనాలు తగ్గిన పని సమయం, తక్కువ జీతం ఉన్న కుటుంబ-స్నేహపూర్వక ఉద్యోగాలలో ఉపాధి, తల్లుల కెరీర్‌లను దెబ్బతీసే నియామకం మరియు పదోన్నతి నిర్ణయాలు మరియు కార్మిక మార్కెట్ నుండి కాలం గడిచిన తర్వాత మహిళలు తిరిగి పనికి రావడానికి మద్దతు ఇచ్చే కార్యక్రమాలు లేకపోవడంతో ముడిపడి ఉన్నాయి. పరిమితమైన, సాంప్రదాయ లింగ పాత్రలు కూడా వేతన అసమానతలను పెంచుతున్నాయి. లింగ మూసలు మహిళలను సాంప్రదాయకంగా పురుషులు ఆధిపత్యం వహించే వృత్తుల నుండి దూరం చేస్తాయి మరియు వారిని తరచుగా "నైపుణ్యం లేనివి" లేదా "మృదువైన నైపుణ్యం కలిగినవి"గా పరిగణించబడే మరియు అందువల్ల తక్కువ జీతం పొందే సంరక్షణ-కేంద్రీకృత పని వైపు నెట్టివేస్తాయి. ఇంకా, వివక్షతో కూడిన నియామక పద్ధతులు మరియు పదోన్నతి నిర్ణయాలు మహిళలు నాయకత్వ పాత్రలు మరియు అధిక వేతనం పొందకుండా నిరోధించడం వలన లింగ వేతన అంతరం కొనసాగుతుంది.

> *"లింగ వేతన అంతరం యజమానులు, ప్రభుత్వాలు, ట్రేడ్ యూనియన్లు సహా అన్ని వాటాదారులు పూర్తి బాధ్యత వహించి ఈ సవాళ్లను పరిష్కరించడానికి పక్కపక్కనే పనిచేయాలని కోరుతోంది. సమాన విలువ కలిగిన పనికి మహిళలు సమాన వేతనం పొందాలి"*
>
> **ఐక్యరాజ్య సమితి మహిళా ఆర్థిక సాధికారత చీఫ్ డాక్టర్ జెమిమా న్జుకి**

## పే ఈక్విటీ ఎందుకు అత్యవసర సమస్య?

సమాన చెల్లింపు ముఖ్యం ఎందుకంటే ఇది స్పష్టమైన అన్యాయం మరియు లక్షలాది మంది మహిళలు మరియు కుటుంబాలను పేదరికం మరియు అవకాశాల అంతరాల జీవితాలకు గురి చేస్తుంది. ప్రస్తుత రేటు ప్రకారం, 2030 నాటికి 340 మిలియన్లకు పైగా మహిళలు మరియు బాలికలను కడు పేదరికంలో వదిలివేసే ప్రమాదం ఉంది మరియు ఆ సంవత్సరం నాటికి 4 శాతం మంది తీవ్ర ఆహార అభద్రతతో పోరాడవచ్చు. పురుషుల కంటే మహిళలు గణనీయంగా తక్కువ సామాజిక రక్షణ కవరేజీని అనుభవిస్తున్నారు, ఈ వ్యత్యాసం వారి తక్కువ శ్రామిక శక్తి భాగస్వామ్య రేట్లు, అధిక స్థాయి తాత్కాలిక మరియు ప్రమాదకర పని మరియు అనధికారిక ఉపాధిని ప్రతిబింబిస్తుంది మరియు పునరుత్పత్తి చేస్తుంది. ఈ కారకాలన్నీ మహిళల ఆదాయం, పొదుపులు మరియు పెన్షన్లు తగ్గడానికి

మరియు వృద్ధాప్యంలో లింగ ఆధారిత పేదరికానికి దోహదం చేస్తాయి.

ఎక్కువ మంది మహిళలు పేదరికంలోకి నెట్టబడుతున్నందున, సమాన వేతనం మరియు వేతన సమానత్వం కోసం పోరాటం కొత్త అత్యవసర భావాన్ని సంతరించుకుంటుంది ఎందుకంటే తక్కువ సంపాదించే వారు ఆదాయ వ్యత్యాసం వల్ల ఎక్కువగా నష్టపోతారు. యునైటెడ్ స్టేట్స్‌లో, తెల్ల పురుషులు సంపాదించే ప్రతి డాలర్‌కు నల్లజాతి మహిళలు 63.7 సెంట్లు, స్థానిక మహిళలు 59 సెంట్లు మరియు లాటినా మహిళలు 57 సెంట్లు మాత్రమే సంపాదిస్తారు. డబ్బు తక్కువగా ఉన్న చోట, తక్కువ జీతం మహిళలు మరియు కుటుంబాలు ఆహారం పెట్టకుండా, సురక్షితమైన గృహాలను పొందకుండా మరియు కీలకమైన వైద్య సంరక్షణ మరియు విద్యను పొందకుండా నిరోధించవచ్చు - తరతరాలుగా పేదరిక చక్రాలను శాశ్వతం చేసే ప్రభావాలు.

మహిళా కార్మికులను పురుష కార్మికులతో సమానంగా ఉంచడం అత్యవసరం. సంరక్షణ లోటు అంచున ఉన్న ప్రపంచంలో, ప్రపంచవ్యాప్తంగా అవసరమైన ఆరోగ్య మరియు సామాజిక సంరక్షణ సేవలను అందించే కార్మికులలో మహిళలు 67 శాతం ఉన్నారు . విద్య, ఆరోగ్య సంరక్షణ మరియు సామాజిక సేవలతో సహా సంరక్షణ రంగంలో తక్కువ జీతం మరియు తక్కువ విలువ కలిగిన ఉద్యోగాలను, మహిళలు ప్రధానంగా ఆక్రమించే అన్ని ఉద్యోగాలను ప్రభుత్వాలు పరిష్కరించాలి.

## ప్రపంచవ్యాప్తంగా వేతన సమానత్వం గురించి డేటా ఏమి చెబుతుంది?

అసమాన వేతనం అనేది ఒక మొండి పట్టుదలగల మరియు సార్వత్రిక సమస్య. మహిళల విద్య మరియు కార్మిక మార్కెట్ భాగస్వామ్యంలో గణనీయమైన పురోగతి ఉన్నప్పటికీ, లింగ వేతన అంతరాన్ని తగ్గించడంలో పురోగతి చాలా నెమ్మదిగా ఉంది. ఈ వేగంతో, ఆర్థిక లింగ సమానత్వాన్ని సాధించడానికి దాదాపు 300 సంవత్సరాలు పడుతుంది. అన్ని దేశాలలో మరియు అన్ని స్థాయిల విద్య మరియు వయస్సు వర్గాలలో మహిళా కార్మికుల సగటు వేతనం సాధారణంగా పురుషుల కంటే తక్కువగా ఉంటుంది, మహిళలు పురుషులు సంపాదించే దానికంటే సగటున 80 శాతం సంపాదిస్తారు. పురుషాధిక్య పరిశ్రమలలో మహిళలు స్త్రీ-ఆధిక్య పరిశ్రమలలోని వారి కంటే ఎక్కువ సంపాదించవచ్చు, కానీ లింగ వేతన అంతరం అన్ని రంగాలలో కొనసాగుతుంది.

లింగ వేతన అంతరం అంచనాలు ప్రాంతాల వారీగా మరియు దేశాలలో కూడా గణనీయంగా మారవచ్చు, తక్కువ మరియు మధ్య-ఆదాయ దేశాలతో పోలిస్తే అధిక ఆదాయ దేశాలు తక్కువ స్థాయి వేతన అసమానతలను కలిగి ఉంటాయి. అయితే, లింగ

వేతన అంతరం యొక్క అంచనాలు సమస్య యొక్క వాస్తవ పరిధిని తక్కువగా అంచనా వేస్తాయి, ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో, అనధికారిక ఆర్థిక వ్యవస్థల గురించి సమాచారం లేకపోవడం వల్ల, అవి మహిళా కార్మికులతో అసమానంగా తయారవుతాయి, కాబట్టి పూర్తి చిత్రం అందుబాటులో ఉన్న డేటా మనకు చూపించే దానికంటే దారుణంగా ఉంటుంది.

లింగ వేతన అంతరాన్ని తగ్గించడానికి అందరికీ మంచి పని కల్పించే చర్యలు అవసరం. అనధికారిక ఆర్థిక వ్యవస్థను అధికారికీకరించడాన్ని ప్రోత్సహించే చర్యలు, అనధికారిక కార్మికులను చట్టపరమైన మరియు ప్రభావవంతమైన రక్షణ కిందకు తీసుకురావడం మరియు వారి ప్రయోజనాలను బాగా కాపాడుకోవడానికి వారికి అధికారం ఇవ్వడం ఇందులో ఉన్నాయి. కార్మికులకు సమిష్టిగా వ్యవస్థీకరించడానికి మరియు బేరసారాలు చేయడానికి హక్కును నిర్ధారించడం పరిష్కారంలో ఒక ముఖ్యమైన భాగం. మహిళలు యజమాని మరియు యూనియన్ నాయకత్వంలో పాల్గొనాలి, కార్యాలయంలో లింగ సమానత్వం కోసం సమగ్ర చట్రాలను ఏర్పాటు చేసే చట్టాన్ని రూపొందించడానికి వీలు కల్పించాలి.

---




## ఆకాశంలో సగం.. చట్టసభల్లో అంతంతమాత్రం

# మాతా శిశు మరణాల తగ్గింపుపై ప్రత్యేక ప్రణాళిక

## వైద్యులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు

## ఏపి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడి

మాతా, శిశు మరణాల్ని తగ్గించేందుకు ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఇందులో భాగంగా ప్రస్తుతం మాత, పుట్టిన ఏడాదిలోపు శిశు మరణాలకు దారితీస్తున్న కారణాలు, వైద్యులు, సిబ్బంది అనుసరిస్తున్న విధానాల్లో ఉన్న చిన్నలోపాలు సైతం గుర్తించి వాటిని పునరావృతం కాకుండా చూసేలా తగిన సలహాలు, సూచనలతో కార్యాచరణ ప్రణాళికను అధికారులు సిద్ధం చేస్తారని తెలిపారు. ఇందుకోసం జిల్లాలవారీగా ముగ్గురు వైద్యులతో పరిశీలక బృందాలను ఏర్పాటు చేసినట్లు మంత్రి సత్యకుమార్ తెలిపారు.

శిశువుల్లో ప్రతి 1000 మందిలో 19 మంది ప్రాణాలు కోల్పోతున్నారు. జాతీయ స్థాయిలో ప్రతి 1000 మందిలో 25 మంది మృతి చెందుతున్నారు. జాతీయ సగటుతో పోల్చితే రాష్ట్రంలో శిశు మరణాలు తక్కువగానే ఉన్నాయి. రాష్ట్రంలో ప్రతి 1000 మంది శిశువుల్లో ప్రాణాలు కోల్పోతున్న 19 మందిలో 16 మంది పుట్టిన 28 రోజుల్లోపు కన్నుమూస్తున్నారు. ఇదేవిధంగా జాతీయస్థాయిలో ప్రతి 1000 మంది శిశువుల్లో 19 మంది ప్రాణాలు కోల్పోతున్నారు. రాష్ట్రంలో మాతృ మరణాలు గతంతో పోలిస్తే గణనీయంగా తగ్గాయి. దేశంలోనే మాతృ మరణాల రేటు తక్కువగా నమోదైన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటిగా నిలిచింది.

ఇటీవల కేంద్ర జనగణన విభాగం శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టం ద్వారా విడుదల చేసిన 2021 - 2023కి సంబంధించిన ప్రత్యేక బులిటెన్ ప్రకారం, ఆంధ్రప్రదేశ్, కేరళల్లో ఎంఎంఆర్ రేటు 30గా నమోదు అయింది. ఇది దేశంలోనే అత్యల్పం. ఐక్యరాజ్య సమితి సూచించిన సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ ప్రకారం మాతృ మరణాల రేటు 70 కంటే తక్కువగా ఉండాలి. తాజా నివేదికలో దేశ వ్యాప్తంగా ఎంఎంఆర్ సగటు 88గా ఉంది. అంటే, ప్రతి లక్ష జననాలకు 88 మంది తల్లులు మరణిస్తున్నారు.

# సుప్రీంకోర్టు తొలి చీఫ్ జస్టిస్ హెచ్.జె. కానియా



**1950** జనవరి **26** - రాజ్యాంగం ఆమోదించబడిన రోజు... భారత కొత్త సుప్రీంకోర్టు మొదటి పని దినం కూడా. మొట్టమొదటి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ హెచ్.జె.కానియా కొలువు తీరిన రోజు కూడా. అదే రోజు ఎనిమిది మంది న్యాయమూర్తులతో మన దేశ అత్యున్నత న్యాయస్థానం తన ప్రస్థానానికి తొలి అడుగు వేసింది.

భారతదేశపు మొదటి ప్రధాన న్యాయమూర్తి అయిన సర్ హరిలాల్ జె కిసోందాస్ కానియా 1890 నవంబర్ 3న గుజరాత్ రాష్ట్రంలోని సూరత్‌లో జన్మించారు. ఆయన ఒక సంస్కృత ప్రొఫెసర్ కుమారుడు, ఆయన రాజరిక రాష్ట్రమైన భావ్‌నగర్‌లోని సమల్‌దాస్ కళాశాలకు ప్రిన్సిపాల్ కూడా. ఆయన తాత గుజరాత్‌లో రెవెన్యూ అధికారిగా పనిచేశారు. సుప్రీంకోర్టులోని మొదటి ఎనిమిది మంది న్యాయమూర్తులలో నలుగురి తండ్రులు సంస్కృత పండితులు అని జార్జ్ గడ్బోయిస్ జడ్జెస్ ఆఫ్ సుప్రీం కోర్ట్ ఆఫ్ ఇండియా 1950-1989లో పేర్కొన్నారు. జస్టిస్ కానియా





రాష్ట్రపతి భవన్‌లోని దర్బార్ హాల్‌లో భారత గణతంత్ర తొలి రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్‌తో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి హెచ్.జె. కానియా ప్రమాణ స్వీకారం చేయించినప్పటి చిత్రం

1910లో సమల్దాస్ కళాశాల నుండి బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ పట్టా పొందారు మరియు చివరికి 1912 మరియు 1913లో బొంబాయిలోని ప్రభుత్వ న్యాయ కళాశాల నుండి వరుసగా LLB మరియు LLM పట్టా పొందారు. 1915లో, ఆయన అసలు వైపు బాంబే హైకోర్టులో తన ప్రాక్టీసును ప్రారంభించారు. జస్టిస్ కానియా తరచుగా తన సోదరుడు హిరాజ్‌లాల్ జె. కానియాతో కలిసి ప్రాక్టీస్ చేసేవారు. ఇద్దరు సోదరులు కుటుంబం నుండి మొదటి తరం న్యాయవాదులు.

## న్యాయమూర్తిగా తొలినాళ్ల జీవితం

జస్టిస్ కనియా 1930లో బాంబే హైకోర్టు తాత్కాలిక న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 'తాత్కాలిక న్యాయమూర్తి' అనేది స్థానిక బొంబాయి ప్రభుత్వం అందించే తాత్కాలిక పదవి, సాధారణంగా భారతీయ నియామకాలకు, శాశ్వత న్యాయమూర్తులు బ్రిటన్‌కు వెళ్లడానికి సెలవు తీసుకున్నప్పుడు, ఇది అదనపు న్యాయమూర్తి పదవికి భిన్నంగా ఉంటుంది, ఇది శాశ్వత నియామకానికి ముందు అంచనా పదవీకాలం.

జస్టిస్ కనియా జూన్ 1931లో అదనపు న్యాయమూర్తి అయ్యారు మరియు మార్చి 1933 వరకు అలాగే కొనసాగారు, ఆ తర్వాత ఆయన కొన్ని నెలలు బార్‌లో తిరిగి చేరారు. అదే సంవత్సరం జూన్‌లో, ఆయన బాంబే హైకోర్టు శాశ్వత న్యాయమూర్తి అయ్యారు.

జస్టిస్ కానియా 13 సంవత్సరాలు బొంబాయి హైకోర్టులో శాశ్వత న్యాయమూర్తిగా ఉన్నారు. 1939లో, ఆయన బాంబే డిస్టర్బెన్సెస్ ఎంక్వైరీ కమిషన్ ఛైర్మన్‌గా నియమితులయ్యారు. 1943లో, జస్టిస్ కానియాకు బ్రిటిష్ క్రౌన్ రాజు పుట్టినరోజు

గౌరవాలలో భాగంగా నైట్ బిరుదును ఇచ్చింది. సర్ జాన్ బ్యూమాంట్ పదవీ విరమణ సమయంలో అత్యంత సీనియర్ న్యాయమూర్తిగా, జస్టిస్ కనియా బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా అతని వారసుడిగా ఉండాలి. కానీ బ్యూమాంట్ బాంబే హైకోర్టు చీఫ్ పదవికి జస్టిస్ కనియా పేరును సిఫార్సు చేయలేదు. బదులుగా, సర్ లియోనార్డ్ స్టోన్ జస్టిస్ కనియాను అధిగమించి 1943లో బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయ్యారు. జస్టిస్ కనియా జూన్ 20, 1946న ఫెడరల్ కోర్టుకు పదవీ విరమణ చేస్తున్న సర్ శ్రీనివాస వరదాచారియర్ స్థానంలో రెండవ సీనియర్ న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

1947 ఆగస్టులో భారతదేశం స్వాతంత్ర్యం పొందే ముందు ఫెడరల్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి సర్ పాట్రిక్ స్పెన్స్ పదవీవిరమణ చేశారు. జస్టిస్ కానియా ఆయన స్థానంలో భారత సంతతికి చెందిన రెండవ ఫెడరల్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి అయ్యారు. మొదటి వ్యక్తి జస్టిస్ వరదాచారియార్. జస్టిస్ కనియాను చీఫ్‌గా నియమించడానికి ప్రతిఘటన లేకుండా లేదు. వాస్తవానికి, లా సెక్రటరీ 1946లో సెతల్వాద్‌ను ఫెడరల్ కోర్టుకు నియమించాలని ఆసక్తిగా ఉన్నారు. స్పెన్స్ పదవీ విరమణ తర్వాత స్వతంత్ర భారతదేశానికి మొదటి ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించే అవకాశాన్ని కూడా ఆయనకు అందించారు. కానీ సెతల్వాద్ వయస్సు కారణంగా ఆ ప్రతిపాదనను తిరస్కరించారు.

జస్టిస్ కనియాను సిజెఐగా నియమించడానికి మరో ప్రధాన అడ్డంకి జవహర్‌లాల్ నెహ్రూకు ఆయనపై అయిష్టత ఏర్పడటం. మద్రాస్ హైకోర్టులో శాశ్వతంగా నియమించబడాలని ప్రతిపాదించబడిన కొంతమంది అదనపు న్యాయమూర్తుల గురించి జస్టిస్ కనియా చేసిన వ్యాఖ్యల నుండి ఇది ఉద్భవించింది. ముస్లిం న్యాయమూర్తి బషీర్ అహ్మద్‌పై చేసిన వ్యాఖ్యకు నెహ్రూ కలత చెందారని నివేదిక. 1950 జనవరిలో, జస్టిస్ కనియా వ్యాఖ్యలను "న్యాయవిరుద్ధం" అని పేర్కొంటూ నెహ్రూ ఒక లేఖ కూడా రాశారు.

1950 జనవరి 26 - రాజ్యాంగం ఆమోదించబడిన రోజు భారత కొత్త సుప్రీంకోర్టు మొదటి పని దినం కూడా. ఈ సమయానికి, కోర్టు ఎనిమిది మంది న్యాయమూర్తులతో కూడిన పూర్తి అధికార సంఖ్యను చేరుకుంది. ప్రధాన న్యాయమూర్తి కానియా పదవీకాలంలో, న్యాయమూర్తులు ఎం.పి.శాస్త్రి, ఎం.సి.మహాజన్, బి.కె.ముఖర్జియా, ఎస్.ఆర్.దాస్, ఎన్.చంద్రశేఖర అయ్యర్ మరియు వివియన్ బోస్ నియమితులయ్యారు. భారత గణతంత్ర తొలి రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్‌తో ప్రధాన న్యాయమూర్తి హెచ్.జె. కానియా ప్రమాణ స్వీకారం జరిపించారు.

1951 నవంబర్ 6న, ఆయన పదవీకాలం ముగిసేలోపు, సిజెఐ కానియా గుండెపోటుతో మరణించారు.

# హక్కుల పరిరక్షణకే సుప్రీంకోర్టు ప్రథమ లక్ష్యం

## తొలి చీఫ్ జస్టిస్ హెచ్.జె. కానియా



1950 జనవరి 26న భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చింది. రెండు రోజుల తర్వాత, జనవరి 28న, పార్లమెంట్ భవనంలోని కోర్టు ఛాంబర్‌లో మన రాజ్యాంగం ప్రకారం సుప్రీం కోర్టు తన మొదటి సమావేశాన్ని నిర్వహించింది. 1958లో ప్రస్తుత భవనానికి మారే వరకు కోర్టు పార్లమెంట్ భవనం నుండే పనిచేసింది. మన గౌరవనీయమైన న్యాయ సంస్థ దేశం మొత్తంపై సార్వభౌమ అధికార పరిధిని వినియోగించుకోవడం ఇదే మొదటిసారి.

1950 జనవరి 29న ప్రచురితమైన 'ది హిందూ' నివేదిక ప్రకారం, "తన కొత్త అధికార పరిధిలో, సుప్రీం కోర్టుకు భారత యూనియన్ మొత్తంపై పౌర మరియు క్రిమినల్ విషయాలలో అప్పీలేట్ అధికారం మాత్రమే కాకుండా... రాజ్యాంగం ప్రకారం హామీ ఇవ్వబడిన ప్రాథమిక హక్కుల అమలుకు సంబంధించి ప్రాథమిక అధికార పరిధి కూడా ఉంది."

ఈ చారిత్రాత్మక రోజున భారతదేశపు మొదటి అటార్నీ జనరల్ నుండి భారత ప్రధాన న్యాయమూర్తి వరకు ఉన్న ప్రముఖ న్యాయనిపుణులు ఏమి చెప్పారనేది మరింత ఆసక్తికరమైన విషయం. కొత్త గణతంత్ర రాజ్యంలో భారత సుప్రీం కోర్టు ఏ పాత్ర పోషించాల్సి ఉంటుందో అనే దానిపై వారు తమ దార్శనికతను వివరించారు.

మొదటి అటార్నీ జనరల్, ఎం.సి. సెతల్వాడ్ ప్రసంగిస్తూ "జాతీయ మరియు

అంతర్జాతీయ విధులను నిర్వర్తించే ఒక దేశాన్ని నిర్మించడంలో, ఈ కోర్టు గొప్ప మరియు విశిష్టమైన పాత్ర పోషిస్తుంది మరియు భారత ప్రజల మనస్సులలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటుంది. అన్ని మానవ సంస్థల మాదిరిగానే, సుప్రీం కోర్టు కూడా సత్యం ద్వారా గౌరవాన్ని సంపాదిస్తుందని మేము ఆశిస్తున్నాము" అని అన్నారు.

ఆయన ప్రసంగానికి భారతదేశపు మొదటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సర్ హరిలాల్ జెకిసుందాస్ కానియా స్పందిస్తూ, "భారత సుప్రీం కోర్టుకు చాలా విస్తృత అధికారాలను ప్రసాదించడం ద్వారా, తమ ఎన్నికైన ప్రతినిధుల ద్వారా ప్రజల గొంతుకను ప్రతిబింబించే రాజ్యాంగ పరిషత్, న్యాయం అందించే అంతిమ సంస్థగా కోర్టుపై పూర్తి విశ్వాసాన్ని చూపింది. మేము ఆ విశ్వాసానికి అర్హులం అవుతామని ఆశిస్తున్నాము. భారత ప్రజలు కూడా సుప్రీం కోర్టు యొక్క స్వాతంత్ర్యం, గౌరవం మరియు ప్రతిష్టను కాపాడుతారని మేము విశ్వసిస్తున్నాము." అని అన్నారు.

మన గణతంత్ర చరిత్ర యొక్క సుదీర్ఘ ప్రస్థానాన్ని పరిశీలిస్తే, న్యాయాన్ని అందించే సంస్థగా కోర్టు అనేక సందర్భాలలో రాణించింది మరియు చాలా వరకు, ఈ సంస్థ భారత ప్రజలలో తన గౌరవ స్థానాన్ని నిలబెట్టుకుంది. 1973లో కేశవానంద భారతి వర్సెస్ కేరళ రాష్ట్రం కేసులో కోర్టు ఇచ్చిన తీర్పు ఇందుకు ఒక ఉదాహరణ, ఈ కేసులో కోర్టు తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించింది.

ఈ తీర్పు రాజ్యాంగంలోని కొన్ని భాగాలను సవరించే పార్లమెంట్ అధికారంపై గణనీయమైన పరిమితులను విధించింది మరియు "ప్రాథమిక స్వరూపం" సిద్ధాంతానికి జన్మనిచ్చింది, దీని ప్రకారం, ఇతర నిబంధనలతో పాటు, వ్యక్తులకు మంజూరు చేయబడిన ప్రాథమిక హక్కులు "ప్రాథమిక లక్షణాలు"గా పరిగణించబడతాయి.

వాస్తవానికి, 1977లో మేనకా గాంధీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా వంటి ఇతర కేసులు కూడా ఉన్నాయి, 1975 మరియు 1977 మధ్య 21 నెలల పాటు అన్ని ప్రాథమిక హక్కులు నిలిపివేయబడిన అత్యవసర పరిస్థితి యొక్క భయానక పరిస్థితుల తర్వాత, ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 (జీవించే హక్కు మరియు వ్యక్తిగత స్వేచ్ఛ)లో పొందుపరిచిన వ్యక్తిగత స్వేచ్ఛ హక్కును నొక్కి చెప్పింది.

"అంతటి ముఖ్యమైన విధులను నిర్వర్తించే బాధ్యతతో, అన్ని ప్రజాస్వామ్య దేశాలలో సుప్రీం కోర్టు తన విధులను నిర్వర్తించడంలో శాసనసభ లేదా కార్యనిర్వాహక అధికారం నుండి పూర్తిగా స్వతంత్రంగా ఉండాలి అనేది స్పష్టం. భారత రాజ్యాంగం ప్రకారం, ప్రజల ప్రాథమిక హక్కులు మరియు స్వేచ్ఛలను పరిరక్షించడానికి సుప్రీం కోర్టు స్థాపించబడింది. ఒక స్వతంత్ర సుప్రీం కోర్టు... భారత యూనియన్ యొక్క రాజ్యాంగ చరిత్ర మరియు

పురోగతిపై సుదూర ప్రభావం చూపుతుంది," అని జస్టిస్ హెచ్.జె. కానియా అన్నారు.

"ప్రజాస్వామ్య దేశంలో, ప్రజలు తమ శాసనసభ ద్వారా చట్టాలను రూపొందిస్తారు. శాసనసభ ఆమోదించిన చట్టాలను ఒక ఉన్నత అధికారం వలె పర్యవేక్షించడం లేదా సరిదిద్దడం న్యాయస్థానం యొక్క విధి కాదు... తరచుగా చెప్పినట్లుగా, కష్టమైన సందర్భాలలో, న్యాయస్థానం పక్షాల మధ్య న్యాయం చేయడానికి తన వంతు ప్రయత్నం చేస్తుంది, కానీ చట్టంలో స్పష్టమైన నిబంధన ఉన్నప్పుడు, అది చట్టాన్ని అమలు చేయాలి తప్ప, కొత్త చట్టాన్ని సృష్టించకూడదు," అని జస్టిస్ కానియా తన ప్రారంభోపన్యాసంలో పేర్కొన్నారు.

> "అఖిల భారత న్యాయస్థానంగా సుప్రీంకోర్టు పార్టీ రాజకీయాలు మరియు రాజకీయ సిద్ధాంతాల నుండి స్థిరంగా మరియు దూరంగా ఉంటుంది. ప్రభుత్వంలో జరిగే మార్పులతో దీనికి సంబంధం లేదు. ఈ న్యాయస్థానం ఆ సమయంలో అమలులో ఉన్న చట్టాన్ని అమలు చేయడానికి నిలబడుతుంది, అందరి పట్ల సద్భావన మరియు సానుభూతిని కలిగి ఉంటుంది, కానీ ఎవరికీ అనుబంధంగా ఉండదు"
>
> **– జస్టిస్ కానియా**

ఇది న్యాయవ్యవస్థకు మరియు శాసనసభకు మధ్య అధికారాల స్పష్టమైన విభజనను స్థాపిస్తుంది. అయితే, ఆసక్తికరంగా, న్యాయస్థానం పాత్ర గురించి జస్టిస్ కానియా ఈ విధంగా కూడా అన్నారు. "భారతదేశం లిఖిత రాజ్యాంగాన్ని కలిగి ఉండాలని ఎంచుకుంది మరియు ఆ రాజ్యాంగాన్ని ప్రగతిశీల ఉదారవాదంతో వ్యాఖ్యానించే బాధ్యత సుప్రీంకోర్టుపై ఉంది. సుప్రీంకోర్టు దేశ చట్టాన్ని ప్రకటిస్తుంది మరియు వ్యాఖ్యానిస్తుంది మరియు ఈ దేశ న్యాయవ్యవస్థకు ఉన్న ఉన్నత సంప్రదాయాల దృష్ట్యా, ఆ పని కేవలం లాంఛనప్రాయమైన లేదా నిస్సారమైన న్యాయవాద స్ఫూర్తితో జరగదని మేము విశ్వసిస్తున్నాము. మేము రాజ్యాంగాన్ని ఒక కఠినమైన గ్రంథంగా కాకుండా, తనలోనే స్వయం-పరిపాలన యొక్క శక్తిని మరియు బలాన్ని కలిగి ఉన్న ఒక సజీవ సంస్థగా వ్యాఖ్యానించడానికి ప్రయత్నిస్తాము," అని ఆయన అన్నారు.

న్యాయస్థానం "వ్యాఖ్యానం పేరుతో చట్టాన్ని మార్చలేదని లేదా సవరించలేదని" జస్టిస్ కానియా చెప్పినప్పటికీ, వాస్తవం ఏమిటంటే, పౌరుల ప్రాథమిక హక్కులకు ముప్పు వాటిల్లిన సందర్భాలలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంది.

ఈ విషయంలో, కొందరి ప్రకారం "భారత ప్రజాస్వామ్యాన్ని కాపాడిన" 1973

కేశవానంద భారతి వర్సెస్ కేరళ రాష్ట్రం తీర్పు, న్యాయస్థానం పాత్రను పునఃసమీక్షించడంలో కీలక పాత్ర పోషించింది.

## న్యాయమూర్తుల నియామకం

జస్టిస్ కానియా "మెరిట్" ఆధారంగా న్యాయమూర్తులను నియమించాలని తన ఆకాంక్షను వ్యక్తం చేశారు మరియు "రాజకీయ పరిగణనలు హైకోర్టులకు నియామకాలను ప్రభావితం చేయకూడదు" అని ఆకాంక్షించారు. ఆయన ఇంకా ఇలా అన్నారు, "ప్రధాన న్యాయమూర్తి ఒక నియామకాన్ని ఆమోదించకపోతే, ప్రభుత్వం ఆ నియామకాన్ని చేయదని అర్థమైంది. భారత రాజ్యాంగం ప్రకారం, హైకోర్టు న్యాయమూర్తుల నియామకానికి ముందు ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించాలని నిర్దేశించడం ద్వారా ఈ సంప్రదాయానికి చట్టబద్ధమైన గుర్తింపు ఇవ్వబడిందని మేము నమ్ముతున్నాము."

ఈ ప్రక్రియ కార్యనిర్వాహక వర్గం నుండి న్యాయవ్యవస్థకు అధికారం మారుతూ, అనేక సవరణలకు గురైంది. ప్రస్తుతం, హైకోర్టు మరియు సుప్రీంకోర్టులకు న్యాయమూర్తులను నియమించడానికి న్యాయస్థానం కొలీజియం వ్యవస్థను అనుసరిస్తోంది. పార్లమెంటు చట్టం ద్వారా కాకుండా, సుప్రీంకోర్టు ఇచ్చిన మూడు తీర్పుల పరంపర ద్వారా ఉద్భవించిన సుప్రీంకోర్టు కొలీజియానికి భారత ప్రధాన న్యాయమూర్తి మరియు ఆ న్యాయస్థానంలోని ఇతర నలుగురు సీనియర్ న్యాయమూర్తులు నాయకత్వం వహిస్తారు.

ఇదిలా ఉండగా, హైకోర్టు కొలీజియానికి ఆయా న్యాయస్థానాల ప్రధాన న్యాయమూర్తి మరియు ఆ న్యాయస్థానంలోని ఇతర నలుగురు సీనియర్ న్యాయమూర్తులు నాయకత్వం వహిస్తారు. హైకోర్టు కొలీజియం సిఫార్సు చేసిన అభ్యర్థులకు ప్రభుత్వం ఈ విషయంలో సంప్రదించడానికి ముందు భారత ప్రధాన న్యాయమూర్తి మరియు సుప్రీంకోర్టు కొలీజియం ఆమోదం అవసరం. ఉన్నత న్యాయవ్యవస్థ విషయానికొస్తే, సర్వోన్నత న్యాయస్థానం కొలీజియం సంభావ్య అభ్యర్థుల జాబితాను పరిశీలిస్తుంది మరియు ప్రభుత్వ పాత్ర పరిమితంగా ఉంటుంది.

చివరగా, జస్టిస్ కానియా తన ప్రారంభోపన్యాసంలో ప్రస్తావించిన చివరి మరియు అత్యంత ముఖ్యమైన విషయాలలో ఒకటి రాజకీయ పార్టీల నుండి స్వేచ్ఛ. "అఖిల భారత న్యాయస్థానంగా సుప్రీంకోర్టు పార్టీ రాజకీయాలు మరియు రాజకీయ సిద్ధాంతాల నుండి స్థిరంగా మరియు దూరంగా ఉంటుంది. ప్రభుత్వంలో జరిగే మార్పులతో దీనికి సంబంధం లేదు. ఈ న్యాయస్థానం ఆ సమయంలో అమలులో ఉన్న చట్టాన్ని అమలు చేయడానికి నిలబడుతుంది, అందరి పట్ల సద్భావన మరియు సానుభూతిని కలిగి ఉంటుంది, కానీ ఎవరికీ అనుబంధంగా ఉండదు," అని ఆయన అన్నారు.





ఉరితాడుగా
మారుతున్న పసుపుతాడు..
వరకట్న దాహంతో
నవ వధువుల జీవితం
మూన్నాళ్ల ముచ్చట..

# Form - IV
## (See Rule 8)

Statement about ownership and other particulars of the UDBHAVA Telugu Monthly, Hyderabad, as required under Rule 8 of the Registration of News Paper (Central) Rules, 1956.

| | | |
|---|---|---|
| 1. Place of Publication | : | Hyderabad |
| 2. Periodicity of Publications | : | Monthly |
| 3. Printer's Name | : | M. Madhava Vasu |
| Whether Citizen of India? | : | Yes |
| Address | : | 1-24-21/4, (24-387), Plot No.1,<br>Sri Sai Nagar, Lothukunta,<br>Alwal, Secunderabad - 500 015 |
| 4. Publisher's Name | : | M. Madhava Vasu |
| Whether Citizen of India? | : | Yes |
| Address | : | 1-24-21/4, (24-387), Plot No.1,<br>Sri Sai Nagar, Lothukunta,<br>Alwal, Secunderabad - 500 015 |
| 5. Editor's Name | : | M. Madhava Vasu |
| Whether Citizen of India? | : | Yes |
| Address | : | 1-24-21/4, (24-387), Plot No.1,<br>Sri Sai Nagar, Lothukunta,<br>Alwal, Secunderabad - 500 015 |
| 6. Name and address of Individuals who own the Newspaper | : | M. Madhava Vasu |
| | : | 1-24-21/4, (24-387), Plot No.1,<br>Sri Sai Nagar, Lothukunta,<br>Alwal, Secunderabad - 500 015 |

I, M. Madhava Vasu, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-

**M. Madhava Vasu**
(Publisher)